

30న కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం




విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ఈ నెల 30వ తేదీన ప్రారంభిస్తున్నామని చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లు దీనిని ప్రారంభిస్తారని చెప్పారు. ఇది విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు మరింత అదనపు ఆకర్షణగా నిలుస్తుందన్నారు.

ముందుకుసాగని మాస్టర్ ప్లాన్

- భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ఏడు రహదారుల నిర్మాణానికి ఏడాది క్రితం ప్రతిపాదనలు
- ఇప్పటి వరకూ ఒక్క అడుగు కూడా నిర్మించని వైనం
- భూముల సేకరణలో అడ్డంకులే కారణం
- ప్రత్యామ్నాయం ఆలోచించని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భోగాపురం విమానాశ్రయం మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు'గా ఉన్నాయి. విమానాశ్రయం ప్రారంభించే నాటికి రహదారుల నిర్మాణం పూర్తి చేయాల నేది లక్ష్యం. వచ్చే జూన్‌లో విమానాశ్రయం ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇటు చూస్తే కనీసం ఒక రహదారికి కూడా పూర్తిగా భూసేకరణ జరగలేదు.



అడవివరం నుంచి శొంఠ్యాం వరకు విస్తరించాల్సిన మార్గం

భోగాపురం విమానాశ్రయానికి విశాఖపట్నం నగరం మధ్య నుంచి వెళ్లే ప్రధాన మార్గంలో ట్రాఫిక్ తగ్గించి, వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లించడానికి వీఎంఆర్‌డీఏ ఏడాది క్రితం కొత్తగా 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి నడుం కట్టింది. ఆ తరువాత ఆచరణలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముందు ఏడు రహదారులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో కొన్ని జీవీఎంసీ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ నిర్వహణలో ఉన్నాయి. వారితో సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంది. ఈ ఏడు రహదారుల పొడవు 26.72కి.మీ. కాగా నిర్మాణానికి రూ.175 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వీఎంఆర్‌డీఏలో ఈ బాధ్యతలను ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు అప్పగించారు.

భూసేకరణలో ఇబ్బందులు

ముందు ప్రతిపాదించిన మొత్తం 15 మాస్టర్ ప్లాన్ రహదారులకు వివిధ వర్గాల నుంచి 75 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అధికారులు ప్రకటించారు. అందులో అసైన్డ్ భూములు, జిరాయితీ, అటవీ భూములు ఉన్నాయి. భూ సేకరణలో మూడు విధాలుగా పరిహారం ఇవ్వడానికి అవకాశం ఉంది. మార్కెట్ రేటు ప్రకారం నగదు భూ యజమానుల ఖాతాలో జమ చేయడం ఒకటి. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం సొమ్ము ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించలేదు. భూమి విలువకు తగిన భూమిని మరోచోట ఇవ్వడం రెండో విధానం. దీనిపై అధికారులు ప్రతిపాదనలు రూపొందించలేదు. ఇక మిగిలింది మూడోదైన టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్)లు. అంటే భూమి విలువ లెక్కించి అమ్ముకునేందుకు వీలుగా ... మిగతా 6వ పేజీలో

విస్తరణ ప్రతిపాదిత రహదారులు...

1. అడవివరం బీఆర్‌టీఎస్ జంక్షన్ (శొంఠ్యాం రహదారి) నుంచి గండిగుండం వరకూ 180 అడుగుల మేర రహదారిని 8 కి.మీ. పొడవున వేయాల్సి ఉంది.దీని అంచనా వ్యయం రూ.40 కోట్లు. ఈ మార్గంలో అటవీ శాఖకు చెందిన భూమి కొంత తీసుకోవలసి ఉంది. ఇవ్వడానికి ఆ శాఖ అధికారులు అంగీకరించడం లేదు. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే తప్ప ఆ భూమిని ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. ఎక్కువమందికి ఉపయోగపడుతుందని భావించిన ఈ మార్గానికే ఆటంకాలు ఎదురయ్యాయి.
2. ఆనందపురం జాతీయ రహదారి నుంచి గంభీరం రిజర్వాయర్ వరకూ 2.2 కి.మీ. రహదారిని ప్రతిపాదించారు.
3. జీవీఎంసీ 18వ వార్డులో శివశక్తి నగర్ నుంచి వుడా హరిత ప్రాజెక్టు వరకు 60 నుంచి 80 అడుగుల మేర 1.7 కి.మీ. రహదారిని విస్తరించాల్సి ఉంది. దీనికి నిర్మాణ వ్యయం రూ.7.65 కోట్లు
4. పరదేశిపాలెం నుంచి గంభీరం వరకూ 1.4 కి.మీ. రహదారిని 60 అడుగుల వెడల్పున విస్తరించాలని ప్రతిపాదించారు. దీని అంచనా వ్యయం రూ.5.04 కోట్లు.
5. నేరళ్లవలస నుంచి దొరతోట మీదుగా తాళ్లవలసకు 80 అడుగుల వెడల్పున 3.83 కి.మీ. రహదారి నిర్మించాలి. దీనికి రూ.24 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.
6. బోయపాలెం జంక్షన్ నుంచి కాపులుప్పాడ వరకు మూడు కి.మీ. రహదారిని 100 అడుగులకు విస్తరించాల్సి ఉంది. తొలుత 6 కి.మీ.కు ప్రతిపాదించారు. ఆ తరువాత సగం తగ్గించేశారు. దీని అంచనా వ్యయం రూ.15 కోట్లు.
7. భీమిలి మండలంలో చిప్పాడ నుంచి విజయనగరం జిల్లా పోలిపిల్లి వరకూ 6.32 కి.మీ. రహదారిని 80 అడుగుల మేరకు విస్తరించాలని ప్రతిపాదించారు. దీనికి రూ.37.92 కోట్లు అంచనా వ్యయం.దివీస్‌యాజమాన్యం సహకరించడానికి ముందుకువచ్చింది.

గూగుల్‌కు భూ సేకరణలో బ్రోకర్ మాయాజాలం!

ప్రతి రైతుకు 55 సెంట్ల భూమి, రూ.1.15 కోట్లు ఇస్తానని ఆఫర్

- మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తికి ప్రతిపాదన
- గ్రామానికి చెందిన వైసీపీ నేత ద్వారా బేరసారాలు
- మాటనిలబెట్టుకోకపోవడంతో తర్లువాడ రైతుల్లో అయోమయం
- ప్రభుత్వ ప్యాకేజీయే బాగుందంటున్న అత్యధికులు



తర్లువాడ భూములు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆనందపురం మండలం తర్లువాడ సర్వేనంబరు-1లో గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూముల వ్యవహారంలో కొందరు రైతులను ఒక బ్రోకర్ అనేక రకాలుగా మాయలో పడేస్తున్నాడు. రెండెకరాలు కలిగిన ఉన్న డీపట్టాదారుడికి 55 సెంట్ల భూమి, రూ.1.15 కోట్ల నగదు ఇస్తానని వారం క్రితం ప్రతిపాదన చేశాడు. మూడు రోజుల్లో సొమ్ము చెల్లిస్తానని ఇచ్చిన మాటను బ్రోకర్ నిలబెట్టుకోలేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం చేసిన ప్రతిపాదనకు ఎక్కువమంది రైతులు మొగ్గుచూపగా, కొద్దిమంది మాత్రం ఇంకా బ్రోకర్ మాయలో ఉన్నారని గ్రామంలో ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంలో కణమాం గ్రామానికి చెందిన వైసీపీ నేతతో కలిసి సదరు బ్రోకర్ నాటకమాడుతున్నాడని పలువురు చెబుతున్నారు.

గూగుల్ డేటా సెంటర్ కోసం 308 ఎకరాలు అవసరం కావడంతో విశాఖ జిల్లా యంత్రాంగం సేకరణకు సన్నద్ధమైంది. దీనిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని పదేపదే గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి, వారిలో అపోహలు తొలగించారు. దీంతో భూముల కోసం సర్వే ప్రక్రియ సాఫీగా సాగిపోయింది. సర్వేనంబరు-1లో 51 మంది రైతులకు 1971లో అప్పటి ప్రభుత్వం రెండు ఎకరాల చొప్పున డీపట్టాలు ఇచ్చింది. మరో 80 మంది ఆక్రమణదారులకు గాను కొద్దిమంది వివరాలు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. వీరు కాకుండా 1998-2000 సంవత్సరాల్లో గ్రామానికి చెందిన 528 మందికి డీఆర్‌డీఏ అధికారులు కొద్ది భూమి కేటాయించి అక్కడ కూరగాయలు/తోటలు పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. వీరిలో చాలామంది ఆయా భూములను సాగు చేయకుండా వదిలేశారు. కాగా గూగుల్ డేటా సెంటర్‌కు భూములు ఇచ్చేందుకు రైతులు పలు డిమాండ్లు పెట్టగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. డీపట్టా ఉన్న రైతులకు ఎకరాకు 20 సెంట్ల భూమి ఇచ్చి, మిగిలిన 80 సెంట్లకు ఎకరా రూ.50 లక్షల చొప్పున లెక్కగట్టి రూ.40 లక్షల నగదు, ఒక ఉద్యోగం, వాణిజ్య సముదాయంలో దుకాణం, ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి డీపట్టాదారుల్లో మెజారిటీ రైతులు, ఆక్రమణదారులు అంగీకరించగా కొద్దిమంది డీపట్టాదారులు మాత్రం ససేమిరా అంటున్నారు.

రంగంలోకి బ్రోకర్

భూములు ఇచ్చేది లేదని చెబుతున్న డీపట్టాదారుల వెనుక బ్రోకర్ హస్తం ఉందని ... మిగతా 6వ పేజీలో

అర్ధరాత్రి వేళా చలానాల యావే!

- వాహనాలకు అడ్డంపడి 'ఫోన్‌పే' ఓపెన్ చేయాలని డిమాండ్
- పోలీసుల తీరుపై నగరవాసులు విస్మయం



విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిటీ పోలీసులు ట్రాఫిక్ చలాన్ల వసూళ్ల కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడికక్కడ వాహనాలను ఆపేసి, విషయం ఏమిటో చెప్పకుండా మొబైల్ ఫోన్‌లో 'ఫోన్ పే' యాప్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేనికి అని ప్రశ్నిస్తే...'ముందు ఓపెన్ చేయండి' అంటూ గదమాయిస్తున్నారు. ఓపెన్ చేశాక...పైకి స్క్రోల్ చేయిస్తున్నారు. అక్కడ 'ఈ-చలాన్' ఐకాన్ కనిపిస్తే అందులో ఎన్ని చలాన్లు ఉన్నాయో, వాటికి డబ్బులు అక్కడికక్కడే పే చేయాలని ఒత్తిడి పెడుతున్నారు. ఈ-చలాన్ ఐకాన్ ఓపెన్ కాకపోతే, మీ ఫోన్ అప్‌డేట్ కాలేదని, వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదంతా పాత చలానాల వసూలు కోసమనే విషయం చెప్పడం లేదు. అసలు...వారి దగ్గర ఉన్న డివైజ్‌లోనే వాహనం నంబర్ కొడితే ఎన్ని చలానాలు ఉన్నాయో తెలుస్తుంది. వాటిని చూపించి, కట్టాల్సిందిగా అడగొచ్చు. అలా చేయడం లేదు. వాహన చోదకుడి ఫోన్‌లో ఫోన్ పే యాప్ ఓపెన్ చేయిస్తున్నారు. అర్ధరాత్రి వేళ కూడా పోలీసులు ఇదే పనిలో ఉండడం గమనార్హం.

సీఎం చెప్పినా వినడం లేదు

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించినప్పుడు ట్రాఫిక్ నిబంధనలపై ముందు ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆ తరువాత నోటీసులు ఇవ్వాలని సూచించారు. విశాఖపట్నం పోలీసులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఫొటోలు తీసి, చలానాలు పంపడం, వాటి కోసం దారికాయడం చేస్తున్నారు. ఆ చలానాలు కూడా వంద, రెండు వందలో కాదు, వేల రూపాయల్లో ఉంటున్నాయి. నో ... మిగతా 6వ పేజీలో

అర్ధరాత్రి ఆక్రమణ

దర్జాగా స్టీల్‌ప్లాంటు భూమి కబ్జా

- పునాదులు తీసి, గోడల నిర్మాణం
- నిర్వాసితుల కాలనీ పేరుతో బోర్డు ఏర్పాటు
- పనుల్లో పాల్గొన్న వంద మంది...
- కబ్జాదారులకు నోటీసులు, పోలీసులకు ఫిర్యాదు



స్టీల్‌ప్లాంటు స్థలంలో వేసిన పునాదులు

గాజువాక/పెదగంట్యాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):

కోట్లాది రూపాయల విలువైన స్టీల్‌ప్లాంటు స్థలాన్ని కొందరు కబ్జా చేసి, అర్ధరాత్రి సమయంలో పునాదులు నిర్మించడమే కాకుండా ఓ కాలనీ పేరుతో బోర్డును కూడా ఏర్పాటు చేసేశారు. వివరాల్లోకి వెళితే....

స్టీల్‌ప్లాంటుకు పెదగంట్యాడ మండలం వికాస్‌నగర్ ప్రభుత్వ న్యూ ఐటీఐ ముఖద్వారానికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 53లో అర ఎకరా స్థలం ఉంది. అక్కడ గజం ధర సుమారు రూ.40 వేల వరకు ఉంది. కాలనీ మధ్యలో ఉన్న విలువైన స్థలంలో ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగపడే భవనాలు నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దానిపై కబ్జాదారుల కన్ను పడింది. దీనికి స్టీల్‌ప్లాంటు భూ సేకరణ విభాగం అధికారులు పరోక్షంగా సహకరించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో వంద మందికి పైగా ఆ స్థలం వద్దకు చేరుకుని పనులు ప్రారంభించారు. అప్పటికప్పుడు పునాదులు తీసి, మూడు అడుగుల ఎత్తులో గోడల నిర్మాణం చేపట్టారు. ఆదివారం పూర్తిస్థాయిలో షెడ్లు నిర్మించే దిశగా సన్నాహాలు చేసుకున్నారు.

పనుల్లో వందలాది మంది

అర్ధరాత్రి సమయంలో సుమారు వంద మందికి పైగా అక్రమ నిర్మాణాలు చేపట్టడాన్ని స్థానికులు గుర్తించారు. అక్కడకు చేరుకుని స్టీల్‌ప్లాంటు భూమిలో రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టడంపై నిరసన తెలిపారు. నేరుగా సంబంధిత అధికారులు ఫిర్యాదు చేశారు. కాగా ఈ కబ్జా వెనుక రాజకీయ ప్రముఖుల హస్తం ... మిగతా 6వ పేజీలో

విద్యార్థులు, ఉద్యోగులకే ఏయూలోకి ప్రవేశం

- ఐడీ కార్డులు ధరించిన వారినే అనుమతిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది
- బయటి వ్యక్తులకు నో ఎంట్రీ



విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోకి బయట వ్యక్తులు ప్రవేశించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రధాన గేటు ద్వారా ఇతరులు వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. అదే సమయంలో వర్సిటీకి సంబంధం లేని వ్యక్తులు రావడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్టు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా బయట వ్యక్తులు వసతి గృహాల్లో విద్యార్థులతో గొడవలు పడుతున్నారు. ఇటువంటి వాటిని కట్టడి చేసేందుకు ఉద్యోగులను, విద్యార్థులను మాత్రమే క్యాంపస్‌లోకి అనుమతించాలని సెక్యూరిటీ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉద్యోగులు, విద్యార్థులు ఇకపై తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించి రావాల్సి ఉంటుంది. ఐడీ కార్డును పరిశీలించిన తరువాత మాత్రమే ... మిగతా 6వ పేజీలో

27న ఉక్కు కార్మికుల మహా ధర్నా

- ఉత్పత్తి ఆధారిత జీతాల ఉత్తర్వులు ఉపసంహరించుకునే వరకు పోరాటం
- అఖిల పక్ష కార్మిక సంఘం నాయకుల ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకునేంత వరకు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం టౌన్‌షిప్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇదే విషయమై 27వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్లాంటు పరిపాలనా భవనం ఎదుట మహాధర్నా చేపడతామన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి ప్లాంటులో పరిస్థితులు వివరించి, ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరతామన్నారు. ఉత్పత్తి ఆధారిత జీతాలతో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని, యాజమాన్యం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానంలో ప్రధాన అర్చకత్వంపై వివాదం

- నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు కల్పించారంటూ హైకోర్టును ఆశ్రయించిన ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడు
- నిబంధనల ప్రకారం చేయాలని న్యాయస్థానం ఆదేశం
- రెండు నెలలైనా చర్యలు చేపట్టని ఇక్కడి అధికారులు
- దేవదాయ శాఖ కమిషనర్ లేఖ రాసినా బేఖాతరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం దేవస్థానంలో ప్రధాన అర్చక పోస్టుపై మూడేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, వాటిని దేవస్థానం అధికారులు అమలు చేయడం లేదు. తాజాగా దేవదాయ శాఖ కమిషనర్ లేఖ రాసినా సరే ఇక్కడి అధికారుల్లో చలనం లేదు. ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని తెలిసినా పట్టనట్టు ఉంటున్నారు. దీని వెనుక ఆలయంలో కొన్ని దశాబ్దాలుగా పాతుకపోయిన ఒక ఏఈఓ హస్తం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.





గొడవర్తి శ్రీనివాసాచార్యులు



కేకే శ్రీనివాస ప్రసాదాచార్యులు

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుల పోస్టు కోసం 2022లో సీనియారిటీ జాబితా రూపొందించారు. ఉప ప్రధాన అర్చకులుగా ఉండేవారికి అవకాశం కల్పించడం ఆనవాయితీ. అప్పటికే ఇన్‌చార్జి ప్రధాన అర్చక పోస్టులో కేకే శ్రీనివాస ప్రసాదాచార్యులు పనిచేస్తున్నారు. ఆయన్ను కాదని ఉప ప్రధాన అర్చకులుగా ఉన్న గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులకు పదోన్నతి కల్పించారు. దీనిపై ఇన్‌చార్జి ప్రధాన అర్చకులు హైకోర్టును ఆశ్రయించారు. అందులో ఆయన కొన్ని అంశాలు ప్రస్తావించారు. గొడవర్తి శ్రీనివాసాచార్యులు 2001 నుంచి 2009 వరకు విదేశాలకు వెళ్లి అక్కడ అర్చకత్వం ఉద్యోగాలు చేశారని పేర్కొన్నారు. దానికి సెలవులు ఇచ్చినట్టు సర్వీసు రికార్డులో నమోదైందని కోర్టుకు సమర్పించారు. ఆ తరువాత కూడా పలుమార్లు ఆయన విదేశీయానం చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సర్క్యులర్ 2010 ప్రకారం విదేశీయానం చేసిన వారు గర్భగుడిలో అర్చక విధులు నిర్వహించకూడదని, ఈ విషయం తెలిసి కూడా నాటి దేవస్థానం ఈఓ పదోన్నతి కల్పించారని పిటిషనర్ పేర్కొన్నారు. ఇదిలావుండగా ఈ కేసులో రెండో ప్రధాన అర్చకులైన రమణాచార్యులు కొద్దినెలల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. దాంతో ఇప్పుడు కేసు ప్రధానంగా గొడవర్తి శ్రీనివాసాచార్యులపైనే నడుస్తోంది.

అభ్యంతరాలు వ్యక్తంచేసినా

సీనియారిటీ జాబితా ... మిగతా 6వ పేజీలో



స్వామివారికి గరుడ సేవ చేస్తున్న వైదికులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనారసింహునికి సోమవారం పలు ఆర్జిత సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ సహస్ర నామాలను పఠిస్తూ అన్ని నామాలకు తులసీ దళార్చన చేశారు. తరువాత ఉత్సవమూర్తిని రజిత గరుడ వాహనంపై ఉంచి పూజలు జరిపారు. భక్తులు గరుడ వాహనం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసి, స్వామివారికి శీతల నివేదనలిచ్చారు. అనంతరం నిత్య కల్యాణం నిర్వహించారు.

జమ్మి చెరువు పార్కు అభివృద్ధికి వినతి



జడ్సీకి వినతిపత్రం అందిస్తున్న జేసీ వాకర్స్ క్లబ్ సభ్యులు

భీమునిపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్మి చెరువు పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జేసీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జడ్సీ అయ్యప్పనాయుడును కోరారు. సోమవారం వారు జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జడ్సీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులో పశువులు ప్రవేశించి మొక్కలను తినివేస్తూ, పరిసరాలను పాడుచేస్తున్నాయని తెలిపారు. దీని నివారణకు పార్కు ప్రవేశ ద్వారం వద్ద గేటు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని భక్తులు స్నానాలు ఆచరించే ప్రదేశం వద్ద కాకుండా వేరే చోట ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాయామ పరికరాలు తుప్పు పట్టి పాడవుతున్నాయని, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే పార్కునకు పూర్తిస్థాయి వాచ్‌మేన్‌ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శంకర్‌కుమార్, సంకురుభుక్త జోగారావు, తెరిపిల్లి అప్పారావు, యరబాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. కాగా పీజీఆర్ఎస్‌కు మూడు అర్జీలు అందాయని జడ్సీ అయ్యప్పనాయుడు తెలిపారు. ప్రణాళికా విభాగానికి 1, ఇంజనీరింగ్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. కాగా స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆరు అర్జీలు అందాయి. ఆర్డీవో సంగీత్ మాథూర్ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు



బస్సుల కోసం ఎండలో ఎదురుచూస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాకమర్రి జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్న పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండలో, వర్షంలో వాహనాల కోసం నిరీక్షిస్తున్నారు. దాకమర్రి గ్రామానికి దూరంగా బస్ షెల్టర్ నిర్మించినా.. అక్కడ బస్సులు నిలపడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి కళాశాలలు ఉన్న జంక్షన్ల వద్ద బస్ షెల్టర్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భీమిలి విద్యార్థిని

భీమునిపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ విద్యార్థిని ఎద్దు ప్రార్థన శ్రేష్ఠ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈమేరకు సోమవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు బాలికను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్ 14 విభాగంలో బాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. వీటిలో ప్రార్థన ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. మచిలీపట్నంలో జరిగే పోటీల్లో బాలిక పాల్గొనున్నట్టు తెలిపారు.

విద్యార్థులు, ఉద్యోగులకే ఏయూలోకి ప్రవేశం

... 5వ పేజీ తరువాయి

లోపలకు వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బంది అనుమతి ఇస్తున్నారు. ఒకవేళ ఇతర కళాశాలలకు చెందిన సిబ్బంది ఎవరైనా పనులు నిమిత్తం వచ్చినట్టయితే అధికారుల అనుమతి తీసుకుని మాత్రమే వారిని లోపలకు అనుమతించనున్నారు. ఈ మేరకు సెక్యూరిటీ సిబ్బందికి అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం నుంచి సెక్యూరిటీ సిబ్బంది ఈ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేశారు. ఏయూ ప్రధాన గేటు వద్ద ఐడీ కార్డులను పరిశీలించిన తరువాత లోపలకు అనుమతించారు. అలాగే, అవుట్ గేటు వైపు నుంచి ఎవరూ లోపలకు రాకుండా సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ నిర్ణయంతో క్యాంపస్‌లో బయటి వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ముందుకు సాగని మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

టీడీఆర్లు ఇవ్వడం. ఈ మార్గాల్లో 700 మంది నుంచి భూములు సేకరించాలని తేల్చారు. వారిలో 300 మంది మాత్రమే భూములు ఇవ్వడానికి, ప్రతిగా టీడీఆర్‌లు తీసుకోవడానికి ముందుకు వచ్చారు. ఆ 300 మందిలో ఒక్కరంటే ఒక్కరు మాత్రమే టీడీఆర్ తీసుకోవడానికి అనుమతిస్తూ లేఖ సమర్పించారు. ఇది ప్రస్తుత పరిస్థితి.

అసలు విషయాలు చెప్పడం లేదు

భూసేకరణలో క్షేత్రస్థాయిలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిపై లోతుగా చర్చ జరగడం లేదు. ప్రత్యామ్నాయాలు ఆలోచించడం లేదు. ఉత్తుత్తి సమీక్షా సమావేశాలు పెట్టుకొని నిర్దేశిత గడువులోగా వాటిని పూర్తిచేయాలని పాలకులు, ఉన్నతాధికారులు ఆదేశించడం, ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు అలాగే అంటూ తలలు ఆడించడమే జరుగుతోంది. వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు రహదారి కూడా ఇప్పటివరకూ నిర్మించలేదు. గుర్తించిన మార్గాల్లో కొంతమేరకు జంగిల్ క్లియరెన్స్ మాత్రమే చేశారు. అంటే తుప్పలు మాత్రమే కొట్టారు. ఈ ఏడాది కాలంలో జరిగిన పని అదొక్కటే.

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

- కార్యరూపం దాల్చని తగరపువలస - భీమిలి రహదారి విస్తరణ
- రెండు నెలలు క్రితం మార్కింగ్ చేసిన అధికారులు
- అడుగడుగునా ఆక్రమణలతో పనులకు ఆటంకం

తగరపువలస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస నుంచి భీమిలి వెళ్లే రహదారి విస్తరణ ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. భోగాపురం విమానాశ్రయానికి మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మించే పనుల్లో భాగంగా భీమిలి పోలీసుస్టేషన్ నుంచి తగరపువలస మెయిన్ రోడ్డు మీదుగా బైపాస్ రోడ్డులో పోలీసు అవుట్ పోస్టు వరకు రహదారిని వెడల్పు చేయాలని ప్రతిపాదించారు.తొలుత 120 అడుగులు అని ప్రకటించగా 80 అడుగులకు మార్చారు. ఆ తరువాత 60 అడుగులు సరిపోతుందన్నారు. ఈమేరకు వ్యాపారులతో నామమాత్రంగా సమావేశం నిర్వహించారు. ఈ రహదారిలో అనేక చోట్ల ఆక్రమణలు ఉన్నాయి. చిల్లపేట చెరువు ప్రాంతంలో అనేక మంది చెరువు గర్భాన్ని, చెరువును ఆనుకుని ఉన్న ప్రాంతాలను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. వీటితో పాటు తగరపువలస పాత ఆంధ్రాబ్యాంకు నుంచి తగరపువలస కూడలి వరకు 123 ఆక్రమణలను అధికారులు గుర్తించారు.వీటిని తొలగించడానికి మార్కింగ్ కూడా ఇచ్చారు.ఇది జరిగి రెండు నెలలు కావస్తున్నా.. రహదారి విస్తరణకు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాలతో పాటు అంబేడ్కర్ కూడలి నుంచి బైపాస్ రోడ్డులో పోలీసు అవుట్ పోస్టు వరకు ప్రధాన రహదారి ఉంది.ఈ రహదారిని ఆనుకుని భారీ వ్యాపార సముదాయాలు ఉన్నాయి. రహదారి విస్తరిస్తే వీటిని చాలావరకు తొలగించాల్సి వస్తుంది. ప్రస్తుతం 30 అడుగుల మేర రహదారి ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడం కష్టంగా ఉంది. ఆక్రమణలు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని రోడ్డు వెడల్పు చేయడానికి నిర్ణయించి హద్దులు వేసిన ప్రాంతాల్లో ఉంటున్నవారు కొంత మంది ఈ స్థలాలు తమ పేరు మీద లేకపోతే పరిహారం రాదని రిజిస్ట్రార్ కార్యాలయంలో పక్కా రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. కానీ నెల రోజుల నుంచి రోడ్డు విస్తరణ పనుల్లో ఎటువంటి కదలిక లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన గొట్టపు బావి వేసుకున్న వ్యక్తి విషయంలో నోటీసులు అందించి అధికారులు వదిలిపెట్టారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరిగేలోపు మాస్టర్ ప్లాన్ రహదారులు కూడా నిర్మాణాలు జరగాలని మొదట ప్రకటించారు. కానీ ఇంతవరకు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు.ఎవరి దుకాణాలు తొలగిస్తున్నారో ఏయే ఆక్రమణలు తొలగిస్తున్నారో వారికి నోటీసులు కూడా జారీ చేయకపోవడం విడ్డూరంగా ఉంది. ఆక్రమణదారుల్లో అనేక మంది బడా వ్యాపారవేత్తలు ఉన్నారు. వారి పైరవీల కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులకు నిధులు విడుదలవుతాయని చెప్పారు. నిధులు విడుదల కాగానే పనులు జరుగుతాయని తెలిపారు.



ఇరుగ్గా ఉన్న తగరపువలస రహదారి



మధురవాడ డైలీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు



భారీ వర్షం పడితే మార్కెట్‌లో పరిస్థితి ఇది (ఫైల్‌ఫొటో)

కనీస సౌకర్యాలు లేని మధురవాడ మార్కెట్

- తాత్కాలిక దుకాణాలతో వ్యాపారుల ఇబ్బందులు
- శాశ్వత షాపుల నిర్మాణానికి ముందుకు రాని జీవీఎంసీ
- వర్షం పడితే నీట మునుగుతున్న పరిసరాలు

మధురవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మధురవాడ రోజు వారీ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మధురవాడ పరిసరాల్లోని 15 ప్రాంతాల ప్రజలకు ఈ మార్కెట్ అందుబాటులో ఉంటుంది. దుకాణాలు ఏర్పాటు చేసుకొని 50 మంది ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ కూరగాయలు, పండ్లు, పూజా సామగ్రి, చికెన్, మటన్ దుకాణాలు ఉన్నాయి. నలభై ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఈ మార్కెట్లో కనీస వసతులు లేవు. వ్యాపారులు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఎకరా స్థలంలో ఉన్న ఈ మార్కెట్‌లో దుకాణాలు ఏర్పాటు చేసిన వారి వద్ద నుంచి జీవీఎంసీకి ఆశీలు రూపంలో ఆదాయం సమకూరుతుంది. పదేళ్ల కిందట మార్కెట్లో తాత్కాలిక దుకాణాలు తొలగించి జీ ప్లస్ త్రీ తరహాలో ఎల్ ఆకారంలో శాశ్వత దుకాణాలు నిర్మించడానికి జీవీఎంసీ ప్రతిపాదించింది. ఇందుకు అవసరమైన నిధులు కూడా కేటాయించింది.

కానీ ఈ ప్రతిపాదన మరుగనపడింది. దీంతో వ్యాపారులకు, కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏ మాత్రం వర్షం పడినా.. దుకాణాలు నీట మునిగి వ్యాపారులు నష్టపోతున్నారు. వర్షం నీటిలో పూలు, పండ్లు, కూరగాయలు కొట్టుకుపోతుండడంతో పాటు ఆ సమయంలో కొనుగోలుదారులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మార్కెట్‌లో పక్కా దుకాణాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

బాందేవుపురం పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

పద్మనాభం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని బాందేవుపురం పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన సాగి కృష్ణమూర్తిరాజు ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, సహకార సంఘాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే గంటా ఆయన్ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, మండల యూత్ అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తిరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



తునివలసలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తునివలసలో 'రైతన్న మీ కోసం'

పద్మనాభం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తునివలస గ్రామంలో సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచులు మూర్తి, మహేశ్వరరావు ఈసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఐదు ప్రమాణాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు. నీటి భద్రత, పంటల డిమాండ్, అగ్రి టెక్, ఫుడ్ ప్రాసెసింగ్, పంటలకు మద్దతు ధర అంశాలపై ఈ సభల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయాధికారి ఎంవీ చలం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లోనూ ఈ సభలు నిర్వహిస్తామని చెప్పారు.

ఏజెన్సీలో నారసింహ దీక్షలపై ప్రచారం



గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సురేంద్ర

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని సింహాద్రి మఠం ప్రతినిధి కసిరెడ్డి సురేంద్ర నారసింహ దీక్షల గురించి గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. సోమవారం అల్లూరి జిల్లాలోని జీకే వీధి మండలం పీవీటీజి గిరిజన గ్రామాల్లో అప్పన్న దీక్షలు చేపట్టాలని కోరుతూ ప్రచారం చేశారు. వచ్చే నెల 3 నుంచి సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో మండల దీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా గిరిజనులకు అప్పన్నస్వామి ఫొటోలను పంపిణీ చేశారు.

తుప్పు పట్టిన వ్యాయామ పరికరాలు



తుప్పు పట్టి, విరిగిపోయిన పరికరాలు

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహా విశాఖ 98వ వార్డులో జీవీఎంసీ సాధారణ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లోని పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. కాపువీధిలోని సచివాలయం ముందు ఏర్పాటు చేసిన పరికరాలు చాలావరకు విరిగిపోయాయి. మరికొన్ని తుప్పు పట్టి దిష్టిబొమ్మలా కనిపిస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి వాటి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

బీమా చెక్కులు పంపిణీ



హేమంత్ కుటుంబ సభ్యుడికి చెక్కు అందిస్తున్న నాగబాబు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేఖవానిపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మేడిసి హేమంత్ కుమార్ అనకాపల్లిలో జరిగిన బాణసంచా పేలుడులో మృతి చెందడంతో అతని కుటుంబానికి పార్టీ అధిష్ఠానం రూ. 5 లక్షల పరిహారం అందజేసింది. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబు, బాధిత కుటుంబానికి ఈ చెక్కు అందించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీపురం గ్రామానికి చెందిన కార్యకర్త కొల్లి వెంకట అప్పారావు భార్యకు కూడా రూ. 5 లక్షల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సాగర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఆర్. సన్యాసినాయుడు అన్నారు. సోమవారం రుషికొండలో జరిగిన ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ విభాగం సౌత్ క్లస్టర్ హెడ్ ఎస్తార్ సెల్వం అధ్యక్షతన నిర్వహించిన రీజనల్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీత, నాగలక్ష్మి, మత్స్యకార సంఘం ప్రతినిధి తెడ్డు శంకర్, జేవీ రత్నం, పాల్గొన్నారు.

జగద్గురు పీఠం జాతీయ అధ్యక్షుడు కేఎస్ శాస్త్రి కన్నుమూత



అక్కయ్యపాలెం (విశాఖపట్నం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ హోమియో వైద్యుడు, జగద్గురు పీఠం (ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి (89) సోమవారం ఉదయం అక్కయ్యపాలెంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు శాస్త్రి కుమారుడు కె.శ్రీనివాస్ తెలిపారు. మాస్టర్ ఇకె నుంచి స్ఫూర్తిని పొందిన డాక్టర్ కేఎస్ శాస్త్రి తన జీవితాన్ని హోమియో వైద్య సేవకు నిస్వార్థంగా అంకితం చేశారు. లక్షలాది మందికి వైద్యం అందించారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పీఠం కార్యనిర్వాహక బృందం పేర్కొంది. సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, ఉపాధ్యక్షుడు ఎస్‌సీఎస్ మూర్తి, సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, చింతలపాటి సత్యదేవ్, సీహెచ్ఎస్ఎన్ రాజు, హనుమంతరావు తదితరులు శాస్త్రి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బ్రోకర్ మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

గ్రామస్థులు చెబుతున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కీలక అధికారి కోసం ఓ బ్రోకర్ తర్లువాడ వచ్చాడు. డీపట్టా రైతుల నుంచి 100 ఎకరాలు తీసుకుంటానని బేరం కుదుర్చుకున్నాడు. డీపట్టాలకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీచేసి తీసుకువస్తానని, ఎకరాకు రూ.ఏడు లక్షలు నగదు, 60 సెంట్లు భూమి ఇస్తానని నమ్మబలికాడు. ఫ్రీహోల్డ్ చేసినందుకు ఎకరాకు 40 సెంట్లు తీసుకునేలా అప్పట్లో ఒప్పందం చేసుకున్నారు. ఆరు నెలలు నుంచి ఏడాది మధ్యన ఫ్రీహోల్డ్ ప్రక్రియ పూర్తిచేస్తానని చెప్పిన బ్రోకర్, హామీని నిలబెట్టుకోలేదు. ఒప్పందం మేరకు ప్రతి రైతుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఈలోగా ఫ్రీహోల్డ్ వ్యవహారంపై దుమారం రేగడం, 2024 ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ప్రక్రియకు తెరపడింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఫ్రీహోల్డ్‌పై ఆంక్షలు విధించింది. ఇప్పటికీ ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పటి నుంచి మౌనంగా ఉండిపోయిన బ్రోకర్, తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నెలకొల్పుతుందని ప్రభుత్వం ప్రకటించడంతో తెరపైకి వచ్చారు. వెంటనే అడ్వాన్సులు ఇచ్చిన రైతులతో మాట్లాడి భూములు తనకే ఇవ్వాలని, అన్ని అనుమతులు తీసుకువస్తానని మరోసారి నమ్మించాడు. ఈలోగా జిల్లా యంత్రాంగం దూకుడు పెంచగా, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని గ్రామస్థులంతా ఒకే తాటిపైకి వచ్చేలా సమావేశాలు నిర్వహించారు. అంతేకాకుండా ప్రభుత్వంలోని కొందరు పెద్దలు సదరు బ్రోకర్‌కు హెచ్చరికలు జారీచేయడంతో తర్లువాడ భూముల వ్యవహారానికి దూరంగా ఉంటానని చెప్పినట్టు ప్రచారం జరిగింది. ఒక పక్క అలా చెప్పినా, మరో వైపు ఆనందపురం మండలం కణమాం గ్రామానికి చెందిన వైసీపీ నేత ద్వారా గ్రామంలోని కొందరు రైతులను రెచ్చగొట్టి కోర్టులో కేసులు వేయించారు. అయితే కోర్టులో చుక్కెదురు కావడంతో వారం కిందట వైసీపీ నేత ద్వారా ఒక ప్రతిపాదన పెట్టారని చెబుతున్నారు. రెండెకరాల డీపట్టా ఉన్న రైతుకు మూడు రోజుల్లో రూ.55 సెంట్లు భూమి, రూ.1.15 కోట్ల నగదు ఇస్తామని బేరం పెట్టారు. దీనికి కొద్దిమంది మొగ్గుచూపగా మిగిలిన వారంతా ససేమిరా అన్నారు. అయితే మూడు రోజుల్లో సొమ్ములు ఇవ్వలేకపోవడంతో రైతులు డైలామాలో పడ్డారు. కాగా ప్రభుత్వం మాత్రం ప్రతి ఎకరాకు 20 సెంట్లు, రూ.40 లక్షల నగదు, ఇంటికి ఒక ఉద్యోగం, దుకాణం, మూడు సెంట్ల భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చింది. బ్రోకర్ ప్రతిపాదన కంటే ప్రభుత్వమే ఎక్కువ పరిహారం ఇస్తున్నందున మెజారిటీ రైతులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని గ్రామానికి చెందిన ఒకరు తెలిపారు. మిగిలిన కొద్దిమంది కూడా త్వరలోనే ప్రభుత్వ ప్రతిపాదనకు మొగ్గుచూపుతారని అన్నారు.

అర్ధరాత్రి ఆక్రమణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సంబంధిత విభాగాల అధికారులు కూడా సహకరించినట్టు సమాచారం.

అధికారులు ఒకలా... పోలీసులు మరోలా...

ఈ విషయమై స్టీల్‌ప్లాంటు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సునీతను వివరణ కోరగా స్టీల్‌ప్లాంటు భూముల్లో అక్రమంగా పునాదులు వేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందిని పంపి విచారణ చేపట్టామని, 15 మంది కబ్జాకు పాల్పడినట్టు తెలిసిందని, వారికి నోటీసులు ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. స్టీల్‌ప్లాంటు స్థలం వద్దకు శనివారం రాత్రి సుమారు 50 మంది వరకు వచ్చారని సమాచారం అందడంతో వెళ్లామని, అయితే వారంతా పరారయ్యారని తెలిపారు. వెంటనే విషయాన్ని ఎస్‌డీసీ, పెదగంట్యాడ తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్లాంటు భూములు కాపాడడంలో భూ సేకరణ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారని స్థానికులు ఆరోపించారు.

ఆక్రమణల తొలగింపు

అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులకు తెలియడంతో సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని కొన్ని ఆక్రమణలను తొలగించారు. అది స్టీల్‌ప్లాంటు భూసేకరణ విభాగానికి చెందిన స్థలమంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింహాచలం దేవస్థానంలో ప్రధాన అర్చకత్వంపై వివాదం

... 5వ పేజీ తరువాయి

తయారు చేస్తున్నప్పుడే తాను ఈ అభ్యంతరాలన్నీ ఆలయ ఈఓ దృష్టికి తీసుకువెళ్లానని, కానీ పట్టించుకోలేదని శ్రీనివాస ప్రసాదాచార్యులు ఆరోపిస్తున్నారు. తనను అదే ఇన్‌చార్జి ప్రధాన అర్చక పోస్టులో ఉంచేసి, ఉప ప్రధాన అర్చకులు ఇద్దరికీ ప్రధాన అర్చకులుగా పదోన్నతులు కల్పిస్తూ 2022 సెప్టెంబరు 18న ఆదేశాలు ఇచ్చి, అమలు చేశారని పేర్కొన్నారు. దీనిపై న్యాయం చేయాలని హైకోర్టును కోరగా, ఆయన చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోగా చర్యలు తీసుకోవాలని 2025 సెప్టెంబరు 18న ఆదేశాలు ఇచ్చింది. దీనిని దేవస్థానం ఈఓ ఇప్పటివరకూ అమలు చేయలేదు. దాంతో బాధిత అర్చకులు ఈ నెల 5వ తేదీన దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. కమిషనర్ రామచంద్రమోహన్ వెంటనే దానిపై చర్యలు తీసుకొని తనకు నివేదిక పంపాలని ఈఓ సుజాతను ఆదేశిస్తూ ఈ నెల 18న ఉత్తర్వులు పంపించారు. ఇప్పటివరకూ వాటిని అధికారులు ముట్టుకోలేదు.

అక్కడ అన్నీ ఆయనే

దేవస్థానంలో ఏఈఓ ఒకరు కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. ఆయనకు శారదాపీఠం స్వామి ఆశీస్సులు ఉన్నాయి. అక్కడ ఆయన చెప్పిందే వేదం. గతంలో సాక్షాత్తూ దేవదాయ శాఖ మంత్రే ఆయన్ను సమీక్షా సమావేశంలో తీవ్రంగా హెచ్చరించారు. ఇప్పుడు ఈ ఉత్తర్వులు అమలు చేయకుండా అడ్డం పడుతున్నది ఆయనేనని దేవస్థానం వర్గాల వాదన. ప్రస్తుతం ఇన్‌చార్జి ఈఓగా ఉన్న డిప్యూటీ కమిషనర్ సుజాత దీనిపై ఇంకా దృష్టి సారించలేదు. ఈ అంశంపై వివరణ కోరేందుకు యత్నించగా ఆమె స్పందించలేదు.

అర్ధరాత్రి వేళా.. చలానాల యావే!

... 5వ పేజీ తరువాయి

పార్కింగ్ అనేచోట నిలిపి ఉంటే రూ.1,535 చలానా వేస్తున్నారు.

ఫోన్ పేలో చెల్లించుకోవచ్చు

- ప్రవీణ్‌కుమార్, అదనపు పోలీస్ కమిషనర్, ట్రాఫిక్

ఇంతకుముందు చలానాలు ఎంపరివాహన్ యాప్‌లో చెల్లించేవారు. కొంత కష్టంగా ఉండేది. అందుకని ఫోన్ పే యాప్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించాం. ఇది సులువు. అందులోనే చెల్లించాలని కోరుతున్నాం..



బహుమతి అందుకుంటున్న మూర్తి

సామాజిక సేవలకు గుర్తింపు

వెంకోజీపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలనీ సంక్షేమ సంఘాలకు చేసిన సేవలకు గాను నగరంలోని జేఆర్‌నగర్‌కు చెందిన పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఎస్.ఆర్. మూర్తికి న్యూఢిల్లీలో విశిష్ట బహుమతి లభించింది. ఇటీవల ఢిల్లీలోని సత్యాగ్రహ మండపం వద్ద నిర్వహించిన సంక్షేమ సంఘ 12వ జాతీయ సదస్సులో కాలనీ సంక్షేమ సంఘాల ఉత్తమ నిర్వాహకులుగా అవార్డు లభించింది. ఢిల్లీ మోడల్ టౌన్ ఎమ్మెల్యే అశోక్ గోయల్ చేతుల మీదుగా మూర్తి ఈ అవార్డును అందుకున్నారు.జాతీయ సముద్ర విజ్ఞాన సంస్థ (ఎన్ఐవో) విశ్రాంత శాస్త్రవేతగా, ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య (ఏపీఫెర్వాస్) సహాయ అధ్యక్షులు, జాతీయ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య (కోర్వా), ప్రధాన సమావేశకర్తగా విభిన్న సంక్షేమసంఘాల కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించినందుకు గాను తనకు ఈఅవార్డు లభించడం చాలా ఆనందంగా ఉందని మూర్తి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన పట్టణ వాతావరణాన్ని అభివృద్ధి చేయాలనే ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నానని తెలిపారు.

డయాబెటిక్ రెటినోపతితో జాగ్రత్త

ఆరిలోవ నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డయాబెటిక్ రెటినోపతి అనే కంటిచూపునకు సంబంధించిన వ్యాధి ఎటువంటి ముందస్తు లక్షణాలు లేకుండా నిశ్శబ్దంగా వస్తుందని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ ఆప్తామాలజిస్టు-విట్రియోరెటినల్ సర్వీసెస్ డాక్టర్ విశాల సంజయ్ జాదవ్ అన్నారు. మధుమేహం ఉన్నవారు దృష్టిని కోల్పోకుండా రెటీనాలో వచ్చే మార్పులను గమనించేందుకు క్రమం తప్పకుండా సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే దృష్టి లోపం వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఘనంగా అంబలం పూజ

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిదో వార్డు పరిధిలోని అప్పుఘర్ వద్ద సోమవారం అయ్యప్ప అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి, వెలగపూడి ప్రతాప్‌రుద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 9వ వార్డు పోలమాంబ ఆలయ ఆవరణలోని అయ్యప్ప పీఠంలో సోమవారం రాత్రి అంబలం పూజ నిర్వహించారు. గురుస్వామి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

సినిమా గైడ్

- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య(గోపాల పట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** : మెలోడి, శ్రీకన్య-2 (గాజువాక),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : కిన్నెర(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్యకిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 49, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 56, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 54, బీరకాయలు 58, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 28, క్యారెట్ 56, దొండకాయలు 46, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 54, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్ధచిక్కుడు 56, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 36, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 60, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

నాసిరకం పనులతో కూలిన ఫుట్‌పాత్



కళాభారతి వద్ద కూలిపోయిన ఫుట్‌పాత్

మద్దిలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 22వ వార్డులో నిర్మాణ కూలీలే ఇంజినీర్లు.. వారే కాంట్రాక్టర్లు.. పనులేవైనా వారికి వచ్చినట్టు చేసుకుంటారు. కాంట్రాక్టర్ సూచనలు ఉండవు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ అసలే అడగొద్దు. ఫలితంగా నాసిరకం పనులు వెక్కిరిస్తున్నాయి. పిఠాపురం కాలనీ కళాభారతి వద్ద నిర్మించిన ఫుట్‌పాత్ సోమవారం ఉదయం కూలిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి ప రాకాష్ఠ. పిఠాపురం కాలనీలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు, వాటిపై ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులు ప్రారంభించి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ సాగుతూ...ఉన్నాయి. కళాభారతి వద్ద కూడా డ్రైనేజీ నిర్మించి వాటిపై ఫుట్‌పాత్ వేశారు. కానీ వారం రోజులు కూడా గడవకముందే కూలిపోయింది. కళాభారతికి ఆనుకుని వార్డు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి గోతులు తీస్తుండగా ఫుట్‌పాత్ పడిపోయింది. ఆ క్షణంలో ఫుట్‌పాత్‌పై పాదచారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కమ్యూనిటీ భవన నిర్మాణానికి గోతులు తీస్తున్నప్పుడు కూలీలు తప్ప కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ నిర్మించాల్సిన భవనం వివాదంలో ఉంది. పార్కును ఆక్రమించి భవన నిర్మాణానికి ప్రయత్నించగా పిఠాపురంకాలనీ అసోసియేషన్ పెద్దలు హైకోర్టును ఆశ్రయించారు.పార్కు స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు ఘాటుగా జీవీఎంసీకి ఆదేశాలివ్వడంతో అప్పటి కమిషనర్ పనులు నిలిపివేశారు. జీవీఎంసీ కమిషనర్ మారడంతో మళ్లీ పనులు ప్రారంభించారు. కోర్టులో కేసు పరిష్కారం కాకుండా పనులు చేపట్టడం దిక్కరణేనని స్థానికులు చెబుతున్నారు.

రైల్వేజోన్ గెజిట్ విడుదలలో తాత్సారం

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జి

అక్కయ్యపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేజోన్ గెజిట్‌ను వెంటనే విడుదల చేయాలని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెంలోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం (దక్షిణ కోస్తా) రైల్వే జోన్‌కు ఈ ఏడాది జనవరి 8న శంకుస్థాపన చేసినా నేటికీ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2019 ఫిబ్రవరిలో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.170 కోట్లు మంజూరు చేసిందని, 2025 జనవరిలో డీపీఆర్ కూడా ఆమోదించారని చెప్పారు. జనవరి 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోన్ కార్యాలయానికి విశాఖపట్నంలో శంకుస్థాపన చేశారని, జూన్ 5న జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించారని, వీఎంఆర్‌డీఏ డెక్ బిల్డింగ్‌లో రెండు ఫ్లోర్లు కూడా సిద్ధం చేశారని గుర్తు చేశారు. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు గెజిట్ విడుదల చేయలేదన్నారు. ఉద్యోగుల సర్దుబాటు, జోన్ హద్దులు, పరిపాలన ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తీవ్రంగా కృషి చేస్తున్నా సీఎం చంద్రబాబు, రాష్ట్రంలోని ఎంపీలు, కేంద్రమంత్రులు కేంద్ర ప్రభుత్వంపై తగినంత వత్తిడి తీసుకొని రాకపోవడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. ఈ విషయంలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వచ్చే నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు చర్చకు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా నగర అధ్యక్షుడు ఎంఎస్ఎన్ మూర్తి, ఏఎస్ నాగభాస్కరం, దామరాజు, శివరామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను రిఫండ్ చెల్లించాలి : సీఐటీయూ

కొమ్మాది, నవంబరు (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల వద్ద 2016 నుంచి 2020 వరకు వసూలు చేసిన ఆదాయపు పన్ను డబ్బులను కార్మికులకు తిరిగి ఇచ్చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో పారిశుధ్య కార్మికులతో కలిసి ఈఈ శాంతిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే అన్ని జోనల్ కార్యాలయాల్లోనూ కార్మికుల వద్ద వసూలు చేసిన ఆదాయపు పన్ను డబ్బులు తిరిగి ఇచ్చేశారని, ఒక్క జోన్-2 కార్యాలయంలో ఇవ్వలేదని తెలిపారు. కార్మికులకు వెంటనే డబ్బులు ఇవ్వాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు డి. సూరిబాబు, సీహెచ్ శేషు, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ జగన్‌మోహన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గంధవరం. తిమ్మాపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

27 నుంచి బిజినెస్ ఇన్నోవేషన్స్ సదస్సు

సాగర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో సుస్థిర సమాజ అభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు అన్న అం శంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజా పి. పప్పు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఫార్మా బస్సులకు నో ఎంట్రీ

గాజువాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల బస్సులను మంగళవారం నుంచి గాజువాక సిటీలోకి అనుమతించమని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు బస్సు డ్రైవర్లకు, యజమానులకు సమాచారం ఇచ్చారు. ఫార్మా కంపెనీలకు చెందిన వందలాది బస్సులు గాజువాక సిటీలోకి రావడంతో ప్రధాన మార్గంలో ట్రాఫిక్ పెరిగిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫార్మా బస్సులు పాతగాజువాక వరకు వచ్చి యూటర్న్ తీసుకుంటాయి. అక్కడి నుంచి ప్రతిచోటా ఆపి ఉద్యోగులను ఎక్కించుకుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గాజువాకకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనగర్ జంక్షన్ వరకు మాత్రమే బస్సుల ప్రవేశాలకు అనుమతిస్తామని, అక్కడి నుంచి ఆటోనగర్ మార్గంలోకి మళ్లించి రోడ్డుకు బాగా లెఫ్ట్‌కు నిలిపి, ఉద్యోగులను దింపుకోవాలని సూచించారు. అన్నక్యాంటీన్ వద్ద యూ టర్న్ తీసుకోవాలని, ఆటోనగర్ రోడ్డులో శ్రీనగర్ వద్ద ఉద్యోగులను ఎక్కించుకోవాలని వివరించారు.



స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

- అవసరమైతే అధికారులతో పోరాడతా..
- కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా...ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టు ఉంది
- పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి అధికారులతో పోరాడతానని పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆయన సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సీఐ జి.రామచంద్రరావుకు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అందరితో పాటే తమ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా.. ప్రతి పక్షంలోనే ఉన్నట్టు ఉందన్నారు. కూటమిలో ఉన్నా.. దురదృష్టవశాత్తూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ పదేపదే తిరుగుతూ, వారితో పోరాడాల్సి వస్తుందన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, వారు పూర్తిగా నిరాశా, నిస్పృహల్లో ఉన్నారన్నారు. కార్యకర్తల కోసం ఎవరితోనైనా పోరాడతానన్నారు. స్థలం ఉండి ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం లేనివారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు,ఎంపీటీసీ సభ్యుడు చైతన్య, నేతలు పల్ల తాతారావు, ఆడారి నాగరాజు, ఎల్లాజీ, బలిరెడ్డి అప్పారావు, రెడ్డి దేముడు, పోతల శ్రీను, కళ్యాణ్, రాజు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు, సతీశ్

'42వ అంశంపై చర్చ జరగాలి'

వెంకోజీపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ ప్రాంతంలో భూముల కేటాయింపుపై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులతో చర్చించకుండా 42వ అంశం కింద అజెండాలో చేర్చడం సరికాదని డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీశ్, వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. సోమవారం వారు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అంశాన్ని అత్యవసరంగా భావించడం పూర్తిగా కౌన్సిల్ కార్యనిర్వహణ నిబంధనలకు విరుద్ధమన్నారు. అభ్యంతరాలు ఉన్నందున పూర్తి చర్చకు అవకాశం ఇవ్వాలని, అనంతరం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఆరిలోవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శనగర్ వెటర్నరీ శిక్షణ సంస్థ కూడలిలో కాయగూరల విక్రయదారుల మధ్య జరిగిన తగాదా చినికిచినికి గాలివానగా మారింది. ఇందులో రుచ్చల వరలక్ష్మిని అనూరాధ, మరో ఇద్దరు గాయపరిచారు. బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు శనివారం ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. స్థలం ఆక్రమించి కాయగూరల షాపులు నిర్వహిస్తున్న వ్యక్తి వేరొకరికి రూ. 30 వేల గుడ్‌విల్, నెలకు రూ. 3 వేల వంతున అద్దెకు ఇచ్చినట్టు సమాచారం ఉందన్నారు. ఇద్దరూ కాయగూరల వర్తకులే.పక్కపక్క దుకాణదారులు కావడంతో పరస్పరం దురుసుగా మాట్లాడుకోవడంతో కొట్లాటకు దారితీసిందన్నారు. పోలీసులు వారించినా గొడవ పడ్డారన్నారు. స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడం, వీరి స్వార్థం వల్ల ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులకు గురికావడం సర్వసాధారణంగా మారింది.

ఏఎంసీలో ఆలిండియా కోటా విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభం



సోనుకు అడ్మిషన్ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆలిండియా కోటా పీజీ కోర్సుల్లో ప్రవేశాల్లో ప్రారంభమయ్యాయి. మొదటిగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ ఎస్ సోను చేరింది. సదరు విద్యార్థి అడ్మిషన్స్‌కు సంబంధించిన పత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కృష్ణవేణి అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎం.రాజేంద్ర కుమార్, సీనియర్ అసిస్టెంట్ జవహర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీకి జిల్లా జట్టు



నూతన జెర్సీలతో టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారులు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న ఫెడరేషన్ కప్ టీ 10 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు పాల్గొంటుందని సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. హవిష్‌నాయుడు, ఎం.పవన్‌కుమార్, ఎస్వీఆర్, రోహిత్, బాలు, సంతోష్, ఆకాష్, సాయి, వినోద్, హేమంత్, యోగి, శ్రీను, మధు, మౌళి, రాజ్‌కుమార్, విష్ణు జట్టులో ఉన్నారన్నారు. బిట్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి వారికి జెర్సీలను అందజేశారు.

రేపు శాసనసభ అంచనాల కమిటీ రాక

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి బుధవారం శాసనసభ అంచనాల కమిటీ రానుంది. మండపేట ఎమ్మెల్యే వి.జోగారావు ఆధ్యక్షతన నియమించిన కమిటీ ఉదయం 8గంటలకు సింహగిరికి చేరుకుని స్వామిని దర్శించుకుంటుంది. అనంతరం జిల్లాలోని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, సింహాచలం ఈవోతో 10.30 గంటల వరకు దేవస్థానం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పించిన వసతులపై చర్చిస్తుంది. ఆ తరువాత కలెక్టర్ కార్యాలయంలో జరగనున్న ప్రత్యేక సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొంటారు. కమిటీలో ఇద్దరు ఎమ్మెల్సీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నట్టు సమాచారం.



సమస్యలు తెలుసుకుంటున్న ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్ భరత్

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజా దర్బార్‌లో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌కు వచ్చే వినతులను పూర్తి స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ సూచించారు. సోమవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో కమిషనర్ తేజ్ భరత్‌తో కలసి వినతులు స్వీకరించారు. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ వీఎంఆర్డీఏ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి కుటుంబాల వారు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రజా దర్బార్‌కు 14 వినతులు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాల వారికి పంపారు. జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి శిల్పా, కార్యదర్శి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడికి ఘన సన్మానం



ఎమ్మెల్యే వెలగపూడిని సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును టీడీపీ తొమ్మిదో వార్డు నూతన కార్యవర్గం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించింది.వార్డు అధ్యక్షుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో నాయకులు అక్కరబోయిన రాంబాబు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మరుపిల్లి చిన్నారావు, గరికిన నూకరాజు, సబ్బి శివ, ఎమ్మిడి సాయి, ముకేష్, మాదిరాజు, ముప్పిడి ఉష, లక్ష్మీ, ప్రభ, సుధ, సత్య, మంగ తదితరులు పాల్గొన్నారు. తమపై నమ్మకం ఉంచి, బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, పార్టీ పటిష్టానికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేకు కార్యవర్గం హామీ ఇచ్చింది.

నూతన సిలబస్ పుస్తకాలు లైబ్రరీలో ఉంచాలి



స్టడీ సర్కిల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌ను బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నూతన సిలబస్‌ను అనుసరించి, లైబ్రరీలో పుస్తకాలు ఉంచాలని ఆదేశించారు. స్టడీ సర్కిల్ గదులను పరిశీలించి చిన్న చిన్న మరమ్మతులను సీఎస్సార్ ఫండ్ సేకరించడం ద్వారా చేయించాలని సూచించారు. స్టడీ సర్కిల్ డైరక్టర్ కె.రాజేశ్వరి, కో-ఆర్డినేటర్ జీవన్‌శంకర్, బీసీ సహాయ సంక్షేమ అధికారి రావి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు గెలుచుకున్న అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు

ఆరిలోవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భారత ఉక్కు మనిషి సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా సోమవారం కృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వారు విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ (విశాఖ)పాము సుధాకర్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ప్రిన్సిపాల్ నిర్వహించారు, వృక్షశాస్త్ర అధ్యాపకుడు వై.సత్యనారాయణ, ఆర్ట్ టీచర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్నకారు

ఆరిలోవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ రిజర్వాయరు సమీపంలో బీఆర్‌టీఎస్ రోడ్డులో సోమవారం మధ్యాహ్నం ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయింది. ఆటో డివైడర్ పైకి వెళ్లింది. అదృష్టవశాత్తూ ఆటోలో ఉన్న ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు. హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం వైపు వెళ్తున్న ఆటోను అదేమార్గంలో వెనుక నుంచి అతివేగంగా కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు.

'ముదపాక రైతులకు ప్లాట్‌లు ఇప్పించాలి'

మహారాణిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమ భూములు తీసుకొని ప్లాట్‌లు ఇప్పించాలని ముదపాక రైతులు కోరారు, సోమవారం వారు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గతంలో తమ గ్రామంలో జీవో నంబర్ 72 ద్వారా ల్యాండ్ పూలింగ్ చేశారని, అప్పుడు సరైన అవగాహన లేకుండా కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టులో కేసులు తీసి వేసి వస్తే ప్లాట్‌లు ఇస్తామని నాయకులు హామీ ఇచ్చారని, కోర్టులో కేసులు ఉపసంహరించుకున్నామని, తమకు ప్లాట్‌లు ఇప్పించాలని విన్నవించారు. కాగా హైకోర్టులో స్టే ఉన్న తొట్లకొండపై క్యాంటీన్ లీజ్‌ను రద్దు చేయాలని బుద్ధిస్టు మాన్యూమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతి నిధులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం వారు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. తొట్లకొండలో అక్రమ నిర్మాణాలు జరుగుతు న్నాయని,



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, రమేశ్‌బాబు, తదితరులు

జనసేన నేత బొలిశెట్టి సతీమణి మృతి పట్ల నివాళి

సిరిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ సతీమణి నాగమణి చిత్రపటం వద్ద ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేశ్, వంశీకృష్ణతో పాటు పలువురు నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఎంవీపీ సెక్టార్ -1లో ఉంటున్న బొలిశెట్టి సత్యనారాయణ సతీమణి ఇటీవల మృతి చెందగా, సోమవారం పెద్ద కర్మ నిర్వహించారు. ఎమ్మెల్యేలు ఆయన నివాసానికి వెళ్లి నాగమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రెండోరోజూ ప్రజావేదిక



వినతిపత్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బిజెపి ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో సోమవారం రెండో రోజు కూడా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అందుబాటులో ఉండి అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఎంసీలో హెచ్‌ఐవీ పరీక్ష



ఎన్‌ఏబీఎల్ సర్టిఫికేట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

మహారాణిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగంలో నిర్వహిస్తున్న హెచ్‌ఐవీ సీడీ ఐసీటీసీ వైరల్ లోడ్ వైద్య పరీక్షా కేంద్రం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంది. రాష్ట్రంలో మొదటిసారిగా ఎన్‌ఏబీఎల్ ఐఎస్‌ఓ 15198 2022 సర్టిఫికేట్ పొందింది. నిర్దిష్ట పరీక్షలు సమర్థంగా నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఏబీఎల్ ఐఎస్‌ఓ ధ్రువీకరించారు. సంస్థ పంపిన సర్టిఫికేట్‌ను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణిల నుంచి మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి అందుకున్నారు. హెచ్‌ఐవీ నోడల్ ఆఫీసర్లు డా టి.శిరీష, డా.బి.అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. చిన్నారు మసీద్, శంకువానిపాలెం, ఎనభై అడుగుల రోడ్డు, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయం ఉత్సవ కమిటీ సభ్యునిగా ఎంఎల్ఎన్ రావు



అక్కయ్యపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీకి చెందిన ఎంఎల్ఎన్ రావు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ఆయన పేరును దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ వెల్లడించారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రావు పనితీరు బాగుందని పలువురు ప్రశంసించారు. తనపై నమ్మకం ఉంచి ఉత్సవ కమిటీ సభ్యునిగా నియమించినందుకు రావు ధన్యవాదాలు తెలిపారు.

హరిత పోలీస్ స్టేషన్ కోసం కృషి



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఐ.భూషణరావు తదితరులు

మాధవధార, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఇకో వైజాగ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మొక్కలు నాటారు. సంస్థ వ్యవస్థాపకులు ఐ.భూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, టీడీపీ మహిళా అధ్యక్షురాలు పి.యమున పాల్గొన్నారు. పచ్చని మొక్కలతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందన్నారు. నిత్యం వందల మంది తిరుగాడే స్టేషన్ ఆవరణను ప్రజలకు ఆహ్లాదకరంగా మార్చాలనే ఉద్దేశంతో మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు, ఉద్యోగులకే ఏయూలోకి ప్రవేశం

... 5వ పేజీ తరువాయి

లోపలకు వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బంది అనుమతి ఇస్తున్నారు. ఒకవేళ ఇతర కళాశాలలకు చెందిన సిబ్బంది ఎవరైనా పనులు నిమిత్తం వచ్చినట్టయితే అధికారుల అనుమతి తీసుకుని మాత్రమే వారిని లోపలకు అనుమతించనున్నారు. ఈ మేరకు సెక్యూరిటీ సిబ్బందికి అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం నుంచి సెక్యూరిటీ సిబ్బంది ఈ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేశారు. ఏయూ ప్రధాన గేటు వద్ద ఐడీ కార్డులను పరిశీలించిన తరువాత లోపలకు అనుమతించారు. అలాగే, అవుట్ గేటు వైపు నుంచి ఎవరూ లోపలకు రాకుండా సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ నిర్ణయంతో క్యాంపస్‌లో బయటి వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అన్న క్యాంటీన్లలో రుచి, శుచి కనిపించాలి

జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



క్యాంటీన్ నిర్వాహకులను ప్రశ్నిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, చిత్రంలో జోనల్ అధికారి తదితరులు

సీతమ్మధార, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్న క్యాంటీన్ల పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని నిర్వాహకులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన జీవీఎంసీ జోన్ 3 పరిధి రామాటాకీస్ విశాఖ కంటి ఆసుపత్రి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను జోనల్ కమిషనర్ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కమిషనర్ ముందుగా అన్న క్యాంటీన్‌లో భోజనం టోకెన్లు జారీ చేస్తున్న విధానాన్ని తనిఖీ చేశారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం భోజనానికి ఎంత మంది అన్న క్యాంటీన్‌కు వస్తున్నారని నిర్వాహకురాలిని ప్రశ్నించి ఆరా తీశారు. క్యాంటీన్ అంతా పరిశీలించి పరిశుభ్రత సరిగా పాటించడం లేదని, ఇకపై నిత్యం పరిసరాల పరిశుభ్రతతో పాటు క్యాంటీన్లో రుచికరమైన వేడి ఆహారాన్ని ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆహారం వడ్డిస్తున్న పరిసరాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ ఎక్కడి నుంచి వచ్చారు? ఆహారం వేడిగా, రుచిగా ఉందా? అని అడగగా వివిధ పనుల కోసం వచ్చామని తెలిపారు. ఆహారం వేడిగా చాలా బాగుందని కమిషనర్‌కి వారు వివరించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు అన్న క్యాంటీన్లను పరిశీలించి పరిసరాలతో పాటు మంచి ఆహారం అందించేలా చూడాలని జోనల్ కమిషనర్లను కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్‌రావు, సహాయక ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం ప్రతిభా పురస్కారాలు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించడం, చిత్తశుద్ధి, అంకితభావంతో ప్రమాదాల నివారణకు కృషిచేసిన ఉద్యోగులను డీఆర్ఎం లలిత్ బొహ్రా సత్కరించి ప్రతిభా పురస్కార అవార్డులతో అభినందించారు. సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లలిత్‌బొహ్రా మాట్లాడుతూ రైల్వే కార్యకలాపాలలో వృత్తి నైపుణ్యం ప్రదర్శించి, ప్రమాదం ముప్పును అంచనా వేసి సత్వర చర్యలు చేపట్టడంలో అసాధారణ ప్రతిభ కనబరచిన ట్రాక్ మెన్, కీమెన్, స్టేషన్‌మాస్టర్లు, లోకో పైలట్లు అభినందనీయులని కొనియాడారు.

అవార్డు పొందిన వారిలో ట్రాక్‌మెన్లు కుమార్ సాహెబ్, సురేష్‌కుమార్ సాహు, జ్ఞానార్జున సాహు, కీమెన్ రాకేష్‌కుమార్, ట్రాక్ మెయింటైనర్లు ఎన్.వరప్రసాద్, ఎం.కూర్మారావు, పాయింట్ మెన్ ఎం.కృష్ణంనాయుడు, స్టేషన్ మాస్టర్ డి.సంతోష్‌కుమార్, అసిస్టెంట్ లోకో పైలట్ బి.తిరుపతిరావు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (డిజైన్ డ్రాయింగ్) జి.నగేష్ ఉన్నారు. వీరిని డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఏడీఆర్ఎం ఈ.శాంతారామ్, వివిధ విభాగాల అధికారులు అభినందించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల పోరాట దీక్ష



గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కంచరపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ -సమగ్ర శిక్షలో ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో ఇబ్బంది పడుతున్న కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం పోరుబాట పట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. ఉద్యోగులకు తక్షణమే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్ వర్తింపు, గ్రాట్యుటీ, ఈపీఎఫ్,ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలు ఆలకించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరేళ్లుగా జీతం పెంచకపోవడంతో పెరిగిన నిత్యావసర ధరలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాట దీక్షలో భాగంగా డిసెంబరు 10న ఎస్పీడీ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోతే సమ్మెకు వెళ్తామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గణపతి రావు, ఎల్ చైతన్య, గురువులు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళా చలానాల యావే!

... 5వ పేజీ తరువాయి

పార్కింగ్ అనేచోట నిలిపి ఉంటే రూ.1,535 చలానా వేస్తున్నారు.

ఫోన్ పేలో చెల్లించుకోవచ్చు

ఇంతకుముందు చలానాలు ఎంపరివాహన్ యాప్‌లో చెల్లించేవారు. కొంత కష్టంగా ఉండేది. అందుకని ఫోన్ పే యాప్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించాం. ఇది సులువు. అందులోనే చెల్లించాలని కోరుతున్నాం..

- ప్రవీణ్‌కుమార్, అదనపు పోలీస్ కమిషనర్, ట్రాఫిక్

డాక్టర్ ప్రకాశరావు కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ



ప్రకాశరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జి తదితరులు

అక్కయ్యపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీలో తిరుమల ఫీవర్ క్లినిక్ వైద్యుడు (రూ.20ల డాక్టర్) కేఎస్ ప్రకాశరావు కుటుంబ సభ్యులను పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జితో కలిసి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సోమవారం పరామర్శించారు. పేద ప్రజల వైద్య దేవునిగా పేరు తెచ్చుకున్న ప్రకాశరావు మన మధ్య లేకపోవడం విచారకరమని ఎంపీ అన్నారు. 42వ వార్డు టీడీపీ, బీజేపీ అధ్యక్షులు కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్‌లను కూడా ఎంపీ పరామర్శించారు. ఇటీవల వారి మాతృమూర్తులు కూడా కాలధర్మం చెందారు. టీడీపీ నాయకులు అకిరెడ్డి జగదీష్, ఎంఎల్ఎన్ రావు, శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు.

స్విమ్మింగ్ టోర్నీ వ్యక్తిగత చాంపియన్ ప్రీటీ



విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో రాష్ట్ర స్థాయి వింటర్ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ టోర్నీలో నగరానికి చెందిన పిపికెఎల్.ప్రీటి వ్యక్తిగత చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగిన ఈ టోర్నీలో గ్రూప్-1 బాలికల కేటగిరీలో ప్రీటీ ప్రతిభను ప్రదర్శించి ఐదు పసిడి పతకాలు పట్టింది. 200మీ. బ్యాక్ స్ట్రోక్, 50మీ. బ్యాక్ స్ట్రోక్, 100 మీ. బ్యాక్ స్ట్రోక్, 400మీ. ఇండివిడ్యువల్ మెడ్లీ, 200మీ. ఇండివిడ్యువల్ మెడ్లీ ఈవెంట్లలో పసిడి పతకాలు సాధించి వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా స్విమ్మింగ్ సంఘం ప్రతినిధులు మోహన్ వెంకట్‌రామ్, కోచ్‌లు, సీనియర్ స్విమ్మర్లు ఆమెను అభినందించారు.

‘రైల్వేజోన్ గెజిట్ విడుదలలో తాత్సారం తగదు’



మాట్లాడుతున్న లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

అక్కయ్యపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేజోన్ గెజిట్‌ను వెంటనే విడుదల చేయాలని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెంలోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం (దక్షిణ కోస్తా) రైల్వే జోన్‌కు ఈ ఏడాది జనవరి 8న శంకుస్థాపన చేసినా నేటికీ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2019 ఫిబ్రవరిలో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.170 కోట్లు మంజూరు చేసిందని, 2025 జనవరిలో డీపీఆర్ కూడా ఆమోదించారని చెప్పారు. జనవరి 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోన్ కార్యాలయానికి విశాఖపట్నంలో శంకుస్థాపన చేశారని, జూన్ 5న జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించారని, వీఎంఆర్‌డీఏ డెక్ బిల్డింగ్‌లో రెండు ఫ్లోర్లు కూడా సిద్ధం చేశారని గుర్తు చేశారు. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు గెజిట్ విడుదల చేయలేదన్నారు. ఉద్యోగుల సర్దుబాటు, జోన్ హద్దులు, పరిపాలన ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తీవ్రంగా కృషి చేస్తున్నా సీఎం చంద్రబాబు, రాష్ట్రంలోని ఎంపీలు, కేంద్రమంత్రులు కేంద్ర ప్రభుత్వంపై తగినంత వత్తిడి తీసుకొని రాకపోవడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. ఈ విషయంలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వచ్చే నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు చర్చకు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా నగర అధ్యక్షుడు ఎంఎస్ఎన్ మూర్తి, ఏఎస్ నాగభాస్కరం, దామరాజు, శివరామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

‘హల్దీ కుంకుమ్’ పుస్తకం ఆవిష్కరణ



పౌరగ్రంథాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో పెన్మత్స లలితావాశిష్ట 2006లో తెలుగులో రచించిన ‘ఊయల కథా సంపుటి’ని రేగులగడ్డ వెంకటలక్ష్మి గాయత్రి హిందీలోకి అనువదించిన హల్దీ కుంకుమ్ పుస్తకావిష్కరణ సభను సోమవారం పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్సలర్, పూర్వ ఏయూ ఉప కులపతి జీఎస్ఎన్‌రాజు, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్ దాస్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగు, హిందీ రచయిత్రులు ఇద్దరినీ అభినందించారు. తండ్రి అచ్యుత రామరాజు ఆశయాలు కొనసాగిస్తున్నందుకు ప్రశంసించారు. రచయిత్రి పెన్మత్స లలిత విశిష్ట, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ దేవులపల్లి పద్మజ, చిరంజీవిరావు, రేగులగడ్డ వెంకటలక్ష్మి గాయత్రి, అక్కినపల్లి భాగ్యలక్ష్మి, పెన్మత్స లక్ష్మీ నరసింహరాజు, పెన్మత్స జగన్నాథ రాజు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, భాగవతుల సత్యనారాయణమూర్తి, లలిత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప అంబలం పూజ



భక్తిగీతాలు ఆలపిస్తున్న స్వాములు, భక్తులు

సీతమ్మధార, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల అభయ దుర్గాదేవి ఆలయం వద్ద బోర శ్రీనివాసరెడ్డి శివయ్యస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప అంబలం పూజను సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపంలో శివపార్వతులు, వినాయకుడు, వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి, లక్ష్మీదేవి అమ్మవారు, సుబ్రహ్మణ్య స్వామి మందిరాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆయప్ప, శివయ్య, భవాని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తిగీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పాల్గొని భక్తులతో కలిసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు పద్మారెడ్డి అన్నప్రసాదం వడ్డించారు. పెద్ద సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

మంచి సినిమాలను ప్రజలకు ఉచితంగా చూపిస్తాం

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు



అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొన్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరరావు, ఇతర సభ్యులు

డాబాగార్డెన్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచి సినిమాలను ప్రజలకు ఉచితంగా చూపించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. గోవాలో ఈ నెల 20 నుంచి 28 వరకు జరుగుతున్న 56వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు, లైఫ్ మెంబర్ ఆర్.శివాజీతో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు. కమిటీ కుర్రాళ్లు...సంక్రాంతికి వస్తున్నాం..మల్లీశ్వరి తెలుగు సినిమాలతో పాటు వివిధ భాషల్లోని జాతీయ, అంతర్జాతీయ సినిమాలను ప్రదర్శిస్తున్నారన్నారు. ఇందులోని మంచి చిత్రాలతో పాటు ప్రజా చైతన్యవంతమైన చిత్రాలకు చెందిన వివరాలు సేకరించి విశాఖ వాసులు వాటిని చూసేలా చర్యలు చేపడతామన్నారు. మంచి చిత్రాల ప్రదర్శన తీరుతెన్నులను ప్రముఖ నటీనటులు కమలహాసన్, బాలకృష్ణ, సుహాసిని, అనుపమ్‌ఖేర్ వంటి వారు తెలియజేశారన్నారు. త్వరలోనే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు సైతం వినతి పత్రం అందజేశామని తెలిపారు.

జగద్గురు పీఠం జాతీయ అధ్యక్షుడు కేఎస్ శాస్త్రి కన్నుమూత



డాక్టర్ కేఎస్ శాస్త్రి (ఫైల్)

అక్కయ్యపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ హోమియో వైద్యుడు, జగద్గురు పీఠం (ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి (89) సోమవారం ఉదయం అక్కయ్యపాలెంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు శాస్త్రి కుమారుడు కె.శ్రీనివాస్ తెలిపారు. మాస్టర్ ఇకె నుంచి స్ఫూర్తిని పొందిన డాక్టర్ కేఎస్ శాస్త్రి తన జీవితాన్ని హోమియో వైద్య సేవకు నిస్వార్థంగా అంకితం చేశారు. లక్షలాది మందికి వైద్యం అందించారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పీఠం కార్యనిర్వాహక బృందం పేర్కొంది. సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, ఉపాధ్యక్షుడు ఎన్‌సీఎస్ మూర్తి, సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, చింతలపాటి సత్యదేవ్, సీహెచ్‌ఎస్ఎన్ రాజు, హనుమంతరావు తదితరులు శాస్త్రి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జోరుగా విద్యార్థుల ఆధార్ అప్డేట్ ప్రక్రియ

మురళీనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలతో ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ కార్డ్ వివరాల నవీకరణ, సవరణలను జోరుగా చేపడుతున్నారు. వ్యక్తిగత వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్ల నమోదులో సవరణ చేస్తున్నారు. చిరునామాల మార్పు, పిల్లల ఆధార్ అప్డేట్ ప్రక్రియలను కొనసాగిస్తున్నారు.

ముందుకుసాగని మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

టీడీఆర్లు ఇవ్వడం. ఈ మార్గాల్లో 700 మంది నుంచి భూములు సేకరించాలని తేల్చారు. వారిలో 300 మంది మాత్రమే భూములు ఇవ్వడానికి, ప్రతిగా టీడీఆర్‌లు తీసుకోవడానికి ముందుకు వచ్చారు. ఆ 300 మందిలో ఒక్కరంటే ఒక్కరు మాత్రమే టీడీఆర్ తీసుకోవడానికి అనుమతిస్తూ లేఖ సమర్పించారు. ఇది ప్రస్తుత పరిస్థితి.

అసలు విషయాలు చెప్పడం లేదు

భూసేకరణలో క్షేత్రస్థాయిలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిపై లోతుగా చర్చ జరగడం లేదు. ప్రత్యామ్నాయాలు ఆలోచించడం లేదు. ఉత్తుత్తి సమీక్షా సమావేశాలు పెట్టుకొని నిర్దేశిత గడువులోగా వాటిని పూర్తిచేయాలని పాలకులు, ఉన్నతాధికారులు ఆదేశించడం, ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు అలాగే అంటూ తలలు ఆడించడమే జరుగుతోంది. వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు రహదారి కూడా ఇప్పటివరకూ నిర్మించలేదు. గుర్తించిన మార్గాల్లో కొంతమేరకు జంగిల్ క్లియరెన్స్ మాత్రమే చేశారు. అంటే తుప్పలు మాత్రమే కొట్టారు. ఈ ఏడాది కాలంలో జరిగిన పని అదొక్కటే.

సింహాచలం దేవస్థానంలో ప్రధాన అర్చకత్వంపై వివాదం

... 5వ పేజీ తరువాయి

తయారు చేస్తున్నప్పుడే తాను ఈ అభ్యంతరాలన్నీ ఆలయ ఈఓ దృష్టికి తీసుకువెళ్లానని, కానీ పట్టించుకోలేదని శ్రీనివాస ప్రసాదాచార్యులు ఆరోపిస్తున్నారు. తనను అదే ఇన్‌చార్జి ప్రధాన అర్చక పోస్టులో ఉంచేసి, ఉప ప్రధాన అర్చకులు ఇద్దరికీ ప్రధాన అర్చకులుగా పదోన్నతులు కల్పిస్తూ 2022 సెప్టెంబరు 18న ఆదేశాలు ఇచ్చి, అమలు చేశారని పేర్కొన్నారు. దీనిపై న్యాయం చేయాలని హైకోర్టును కోరగా, ఆయన చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోగా చర్యలు తీసుకోవాలని 2025 సెప్టెంబరు 18న ఆదేశాలు ఇచ్చింది. దీనిని దేవస్థానం ఈఓ ఇప్పటివరకూ అమలు చేయలేదు. దాంతో బాధిత అర్చకులు ఈ నెల 5వ తేదీన దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. కమిషనర్ రామచంద్రమోహన్ వెంటనే దానిపై చర్యలు తీసుకొని తనకు నివేదిక పంపాలని ఈఓ సుజాతను ఆదేశిస్తూ ఈ నెల 18న ఉత్తర్వులు పంపించారు. ఇప్పటివరకూ వాటిని అధికారులు ముట్టుకోలేదు.

అక్కడ అన్నీ ఆయనే

దేవస్థానంలో ఏఈఓ ఒకరు కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. ఆయనకు శారదాపీఠం స్వామి ఆశీస్సులు ఉన్నాయి. అక్కడ ఆయన చెప్పిందే వేదం. గతంలో సాక్షాత్తూ దేవదాయ శాఖ మంత్రే ఆయన్ను సమీక్షా సమావేశంలో తీవ్రంగా హెచ్చరించారు. ఇప్పుడు ఈ ఉత్తర్వులు అమలు చేయకుండా అడ్డం పడుతున్నది ఆయనేనని దేవస్థానం వర్గాల వాదన. ప్రస్తుతం ఇన్‌చార్జి ఈఓగా ఉన్న డిప్యూటీ కమిషనర్ సుజాత దీనిపై ఇంకా దృష్టి సారించలేదు. ఈ అంశంపై వివరణ కోరేందుకు యత్నించగా ఆమె స్పందించలేదు.

అర్ధరాత్రి ఆక్రమణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సంబంధిత విభాగాల అధికారులు కూడా సహకరించినట్టు సమాచారం.

అధికారులు ఒకలా... పోలీసులు మరోలా...

ఈ విషయమై స్టీల్‌ప్లాంటు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సునీతను వివరణ కోరగా స్టీల్‌ప్లాంటు భూముల్లో అక్రమంగా పునాదులు వేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందిని పంపి విచారణ చేపట్టామని, 15 మంది కబ్జాకు పాల్పడినట్టు తెలిసిందని, వారికి నోటీసులు ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. స్టీల్‌ప్లాంటు స్థలం వద్దకు శనివారం రాత్రి సుమారు 50 మంది వరకు వచ్చారని సమాచారం అందడంతో వెళ్లామని, అయితే వారంతా పరారయ్యారని తెలిపారు. వెంటనే విషయాన్ని ఎస్‌డీసీ, పెదగంట్యాడ తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్లాంటు భూములు కాపాడడంలో భూ సేకరణ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారని స్థానికులు ఆరోపించారు.

ఆక్రమణల తొలగింపు

అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులకు తెలియడంతో సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని కొన్ని ఆక్రమణలను తొలగించారు. అది స్టీల్‌ప్లాంటు భూసేకరణ విభాగానికి చెందిన స్థలమంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రోకర్ మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

గ్రామస్థులు చెబుతున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కీలక అధికారి కోసం ఓ బ్రోకర్ తర్లువాడ వచ్చాడు. డీపట్టా రైతుల నుంచి 100 ఎకరాలు తీసుకుంటానని బేరం కుదుర్చుకున్నాడు. డీపట్టాలకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీచేసి తీసుకువస్తానని, ఎకరాకు రూ.ఏడు లక్షలు నగదు, 60 సెంట్లు భూమి ఇస్తానని నమ్మబలికాడు. ఫ్రీహోల్డ్ చేసినందుకు ఎకరాకు 40 సెంట్లు తీసుకునేలా అప్పట్లో ఒప్పందం చేసుకున్నారు. ఆరు నెలలు నుంచి ఏడాది మధ్యన ఫ్రీహోల్డ్ ప్రక్రియ పూర్తిచేస్తానని చెప్పిన బ్రోకర్, హామీని నిలబెట్టుకోలేదు. ఒప్పందం మేరకు ప్రతి రైతుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఈలోగా ఫ్రీహోల్డ్ వ్యవహారంపై దుమారం రేగడం, 2024 ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ప్రక్రియకు తెరపడింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఫ్రీహోల్డ్‌పై ఆంక్షలు విధించింది. ఇప్పటికీ ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పటి నుంచి మౌనంగా ఉండిపోయిన బ్రోకర్, తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నెలకొల్పుతుందని ప్రభుత్వం ప్రకటించడంతో తెరపైకి వచ్చారు. వెంటనే అడ్వాన్సులు ఇచ్చిన రైతులతో మాట్లాడి భూములు తనకే ఇవ్వాలని, అన్ని అనుమతులు తీసుకువస్తానని మరోసారి నమ్మించాడు. ఈలోగా జిల్లా యంత్రాంగం దూకుడు పెంచగా, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని గ్రామస్థులంతా ఒకే తాటిపైకి వచ్చేలా సమావేశాలు నిర్వహించారు. అంతేకాకుండా ప్రభుత్వంలోని కొందరు పెద్దలు సదరు బ్రోకర్‌కు హెచ్చరికలు జారీచేయడంతో తర్లువాడ భూముల వ్యవహారానికి దూరంగా ఉంటానని చెప్పినట్టు ప్రచారం జరిగింది. ఒక పక్క అలా చెప్పినా, మరో వైపు ఆనందపురం మండలం కణమాం గ్రామానికి చెందిన వైసీపీ నేత ద్వారా గ్రామంలోని కొందరు రైతులను రెచ్చగొట్టి కోర్టులో కేసులు వేయించారు. అయితే కోర్టులో చుక్కెదురు కావడంతో వారం కిందట వైసీపీ నేత ద్వారా ఒక ప్రతిపాదన పెట్టారని చెబుతున్నారు. రెండెకరాల డీపట్టా ఉన్న రైతుకు మూడు రోజుల్లో రూ.55 సెంట్లు భూమి, రూ.1.15 కోట్ల నగదు ఇస్తామని బేరం పెట్టారు. దీనికి కొద్దిమంది మొగ్గుచూపగా మిగిలిన వారంతా ససేమిరా అన్నారు. అయితే మూడు రోజుల్లో సొమ్ములు ఇవ్వలేకపోవడంతో రైతులు డైలామాలో పడ్డారు. కాగా ప్రభుత్వం మాత్రం ప్రతి ఎకరాకు 20 సెంట్లు, రూ.40 లక్షల నగదు, ఇంటికి ఒక ఉద్యోగం, దుకాణం, మూడు సెంట్ల భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చింది. బ్రోకర్ ప్రతిపాదన కంటే ప్రభుత్వమే ఎక్కువ పరిహారం ఇస్తున్నందున మెజారిటీ రైతులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని గ్రామానికి చెందిన ఒకరు తెలిపారు. మిగిలిన కొద్దిమంది కూడా త్వరలోనే ప్రభుత్వ ప్రతిపాదనకు మొగ్గుచూపుతారని అన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎస్.ఎ.డి.జంక్షన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎ ఫ్బ్లాక్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 18 ఫిర్యాదులు

వేపగుంట నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాయలంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 18 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 91వ వార్డు బాజీ జంక్షన్ కమ్యూనిటీ హాల్‌లో ఫ్యాన్లు పనిచేయడం లేదని, 92వ వార్డు గోపాలపట్నంలో రైల్వేస్టేషన్ రోడ్డులో శిథిలమైన భవన నిర్మాణ సమస్యను పరిష్కరించాలని, 94వ వార్డు వేపగుంట గౌతమ్‌నగర్‌లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని, 95వ వార్డు లక్ష్మీపురంలో వీధి దీపాలు, పురుషోత్తపురంలో యుజీడీ పైపులైన్ లీకేజి సమస్యలు పరిష్కరించాలని, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపనులకు పంపిస్తామని జడ్సీ హెచ్.శంకరరావు తెలిపారు.

కుప్పకూలి వ్యక్తి మృతి

పెందుర్తి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుమార్తె కళ్ల ముందే కన్న తండ్రి కుప్పకూలి మరణించిన ఘటన వేపగుంటలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. చింతలఅగ్రహారానికి చెందిన కంపర సత్తిబాబు (42) ఆకు కూరలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అతడి రెండు కళ్లకు సమస్య రావడంతో చూపు మందగించింది. శస్త్రచికిత్స కోసం నగరంలోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లడానికి కుమార్తె నందినితో కలసి చింతలఅగ్రహారం నుంచి వేపగుంట సోమవారం వచ్చి, అక్కడి అరుగుపై కూర్చున్నారు. నగరానికి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా సత్తిబాబు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుమార్తె తట్టి లేపినా చలనం లేదు. దీంతో స్థానికులు అక్కడికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే మృతి చెందాడు స్థానికుల సహకారంతో సత్తిబాబు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

సింహగిరికి శాసనసభ అంచనాల కమిటీ రాక రేపు

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి బుధవారం శాసనసభ అంచనాల కమిటీ రానుంది. మండపేట ఎమ్మెల్యే వి.జోగారావు అధ్యక్షతన నియమించిన కమిటీ ఉదయం 8గంటలకు సింహగిరికి చేరుకుని స్వామిని దర్శించుకుంటుంది. అనంతరం జిల్లాలోని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, సింహాచలం ఈవోతో 10.30 గంటల వరకు దేవస్థానం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పించిన వసతులపై చర్చిస్తుంది. ఆ తరువాత కలెక్టర్ కార్యాలయంలో జరగనున్న ప్రత్యేక సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొంటారు. కమిటీలో ఇద్దరు ఎమ్మెల్సీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నట్టు సమాచారం.

సినిమా గైడ్

- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** : మెలోడి, శ్రీకన్య-2 (గాజువాక),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : కిన్నెర(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల ఫ్రండ్** :శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 49, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 56, పచ్చిమిర్చి 38, కాకరకాయలు54, బీరకాయలు 58, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 28, క్యారెట్ 56, దొండకాయలు 46, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో)90, అల్లం(పాతది) 70, బరబాటి 54, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 36, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరుచిక్కుడు 60, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడిఅల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

తాగునీరు వృథా... పట్టించుకోరా?

- బిందెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పైపులైన్లు పగిలి డ్రైనేజీల్లో కలుస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు


87వ వార్డు రాజపాలెంలో డ్రైనేజీలో కలుస్తున్న నీరు

పెదగంట్యాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందాల్సిన తాగునీరు వృథాగా పోతోంది. అండర్ గ్రౌండ్ వాటర్ లైన్ లీకవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలుగా ఇలా తాగునీరు రోడ్డుపైకి చిమ్మి డ్రైనేజీలో కలిసిపోతోంది. 64వ వార్డు పెదగంట్యాడ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నుంచి కొత్తదిబ్బపాలెం వెళ్లే రోడ్డు పక్క అండర్‌గ్రౌండ్ పైపులైన్ లీకై నీరు డ్రైనేజీలో కలిసిపోతోంది. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్యం వహించిన ఈ వార్డులో ఇలాంటి పరిస్థితి ఉన్నా ఆయన పట్టించుకోవాడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేబీఆర్ నుంచి ముడినీరు తెచ్చి, సిద్ధేశ్వరం కొండవాలు ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్లకు చేర్చి అక్కడ ప్యూరిఫై చేసి కొత్త దిబ్బపాలెం, పెదగంట్యాడ పారిశ్రామిక వాడలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. పైపులైన్‌కు లీకు ఏర్పడడంతో నీటి సరఫరా సామర్థ్యం తగ్గుతోంది. లక్షల రూపాలయలు ఖర్చు చేసి తెచ్చిన నీరు వృథాకాకుండా చూడాలని, పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

86, 87 వార్డుల్లో..

కూర్మన్నపాలెం: పారిశ్రామిక ప్రాంతవాసులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు గొప్పలు చేబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. ఈ ప్రాంతంలో చాలా కాలనీలకు తారునీరు సరఫరా కావడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. బిందెడు నీటి కోసం మహిళలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పైపులు ఎప్పటికప్పుడు పగలడం వల్ల తాగునీరు నేల పాలవుతోంది. ఎప్పుడు నీళ్లు వస్తాయో ఎప్పుడు రావో తెలియదు. 86వ వార్డు దువ్వాడ స్టేషన్ రోడ్డు, ముస్తఫా సెంటర్, 87వ వార్డు లక్ష్మీపురం, రాజులపాలెంలో ఎక్కడికక్కడ తరచూ పైపులైన్లు పగిలిపోయి తాగునీరు డ్రైనేజీల్లో కలిసిపోతోంది. తాగునీటి పైపులైన్‌లలో బురదనీరు కలుషితమవడంతో పలువురు కాలనీవాసులు అంటురోగాల భారిన పడుతున్నారు. రెండు మూడు బిందెలు నీళ్లు పట్టుకోగానే నీటి సరఫరా ఆగిపోతోంది. కాలకృత్యాలకు, వాడకానికి, స్నాన పానాదులకు సమీప చేతి బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకునే దౌర్భాగ్య స్థితి నెలకొంటోంది. నెలలు తరబడి పైపులైన్లు పగిలి మంచినీరు కాలువలలో కలిసిపోయి వృథా అవుతున్నా కార్పొరేషన్ సిబ్బంది ఏం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ వార్డుల్లో తాగునీరు వృథాగా నేల పాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి తాగునీరు వృథాను అరికట్టి, నీటి సరఫరాకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో పోరాడతా..

- కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా...ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టు ఉంది
- పెందుర్తి నియోజకవర్గ ఇన్‌-చార్జి గండి బాబ్జీ


స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో పోరాడతానని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆయన సోమవారం పార్టీ శ్రేణులుతో కలిసి తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సీఐ జి.రామచంద్రరావుకు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారితో బాబ్జీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అందరితో పాటే తమ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా..ప్రతిపక్షంలోనే ఉన్నట్టు ఉందన్నారు. కూటమిలో ఉన్నా.. దురదృష్టవశాత్తూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ పదేపదే తిరుగుతూ, వారితో పోరాడాల్సి వస్తుందన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, వారు పూర్తిగా నిరాశా, నిస్పృహల్లో ఉన్నారన్నారు. కార్యకర్తల కోసం ఎవరితోనైనా పోరాడతానన్నారు. స్థలం ఉండి ఇల్లు లేనివారు, ఇళ్ల స్థలం లేనివారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అధికారులు సానుకూల దృక్పథంతో పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చైతన్య, నేతలు పల్ల తాతారావు, ఆడారి నాగరాజు, ఎల్లాజీ, బలిరెడ్డి అప్పారావు, రెడ్డి దేముడు, పోతల శ్రీను, బొండా కళ్యాణ్, రాజు, దాడి కన్నంనాయుడు, రామకృష్ణరాజు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీకి జిల్లా జట్టు


నూతన జెర్సీలతో టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారులు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న ఫెడరేషన్ కప్ టీ 10 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు పాల్గొంటుందని సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. హవిష్‌నాయుడు, ఎం.పవన్‌కుమార్, ఎస్వీఆర్, రోహిత్, బాలు, సంతోష్, ఆకాష్, సాయి, వినోద్, హేమంత్, యోగి, శ్రీను, మధు, మౌళి, రాజ్‌కుమార్, విష్ణు జట్టులో ఉన్నారన్నారు. బిట్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి వారికి జెర్సీలను అందజేశారు.

ఏఎంసీలో ఆలిండియా కోటా విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభం


విద్యార్థిని సోనుకు అడ్మిషన్ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆలిండియా కోటా పీజీ కోర్సుల్లో ప్రవేశాల్లో ప్రారంభమయ్యాయి. మొదటిగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ ఎస్ సోను చేరింది. సదరు విద్యార్థి అడ్మిషన్స్‌కు సంబంధించిన పత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కృష్ణవేణి అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎం.రాజేంద్ర కుమార్, సీనియర్ అసిస్టెంట్ జవహర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెదగంట్యాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ పట్ల అందరూ బాధ్యతగా ఉండాలని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డులో బాబూ జగజ్జీవన్‌రామ్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏటా తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి పెంచి పెద్ద చేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారిచేత మొక్కలను నాటించారు.

ఇలా ఉంటే ప్రయాణం కష్టమే



నీటిఊట కారణంగా చిత్తడిగా మారిన చంద్రనగర్ అండర్‌పాస్‌వే

గోపాలపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు అండర్‌పాస్‌వేల్లో నీటి ఊటలు పెల్లుబీకడంతో అవి చిత్తడిగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పాత గోపాలపట్నం, చంద్రనగర్ ప్రాంతాల్లో అండర్‌పాస్‌వేల నిర్మాణం కోసం లోతుగా తవ్వకాలు చేపట్టి అండర్‌పాస్ నిర్మానం చేపట్టారు. వర్షాకాలంలో భూగర్భ జలాలు భూ ఉపరితలానికి చేరడంతో అండర్‌పాస్‌వేలో నీటి ఊటల నుంచి నిత్యం నీరు ప్రవహిస్తూనే ఉంటోంది. నాలుగు నెలల నుంచి ఈ అండర్‌పాస్‌వేల్లో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడం లేదు. అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫార్మా బస్సులకు నో ఎంట్రీ

- గాజువాకలోకి ప్రవేశం నిషేధించిన పోలీసులు
- నిబంధనలు పాటించాలని బస్సు డ్రైవర్‌లకు సూచన

గాజువాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల బస్సులను మంగళవారం నుంచి గాజువాక సిటీలోకి అనుమతించమని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు బస్సు డ్రైవర్‌లకు, యజమానులకు వివరించారు. ఫార్మా కంపెనీలకు చెందిన వందలాది బస్సులు గాజువాక సిటీలోకి రావడంతో ప్రధానమార్గంలో ట్రాఫిక్ పెరిగిపోయి సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఫార్మా బస్సులు పాతగాజువాక వరకు వచ్చి యూ టర్న్ తీసుకుంటాయి. అక్కడి నుంచి ప్రతిచోటా ఆపి ఉద్యోగులను ఎక్కించుకుంటాయి. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గాజువాకకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనగర్ జంక్షన్ వరకు మాత్రమే ఫార్మా కంపెనీల బస్సుల ప్రవేశాలకు అనుమతిస్తామని, అక్కడి నుంచి ఆటోనగర్ మార్గంలోకి మళ్లించి రోడ్డుకు బాగా లెఫ్టుకు నిలిపి, ఉద్యోగులను దింపుకోవాలని సూచించారు. అన్నక్యాంటీన్ వద్ద యూ టర్న్ తీసుకోవాలని, ఆటోనగర్ రోడ్డులో శ్రీనగర్ వద్ద ఉద్యోగులను ఎక్కించుకోవాలని వివరించారు.

నగరానికి వెళ్లాల్సిన ఫార్మా బస్సులు శ్రీనగర్ జంక్షన్ నుంచి ఆటోనగర్ వైపు మారాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ గాజువాక వైపు రాకూడదన్నారు. ఫార్మా ఉద్యోగులు శ్రీనగర్ వెళ్లి బస్సులు ఎక్కాలని, అక్కడే దిగి ఇంటికి చేరుకోవాలన్నారు. ఉద్యోగుల వాహనాల పార్కింగ్ కోసం శ్రీనగర్ వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. ఏ సమయంలోనైనా గాజువాకలోకి ఫార్మా బస్సులు ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గాజువాక ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

వీధి కుక్కల నుంచి రక్షించండి

- 86, 87 వార్డులు ప్రజల వినతి


రోడ్డుపై గుంపులుగా చేరిన కుక్కలు

కూర్మన్నపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86, 87వ వార్డుల్లోని కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వడ్లపూడి, కణితి, ఉడానగర్, రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీల్లో విచ్చల విడిగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులపై దాడిచేసి వారి చేతుల్లో ఏం ఉంటే వాటిని లాక్కుపోతున్నాయి.

జీవీఎంసీ సిబ్బంది పై ఆరోపణలు..

వీధి కుక్కలను నివారించడంలో జీవీఎంసీ సిబ్బంది అనుసరిస్తున్న విధానాలపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీధి కుక్కల నుంచి తమను కాపాడాలని జీవీఎంసీ అధికారులకు, సిబ్బందికి తరచూ ఫిర్యాదులు చేస్తున్నా ఫలితంగా ఒక కాలనీలో కుక్కలను పట్టుకుని వేరొక కాలనీలో విడిచి పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

మల్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలం గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో సర్వే నంబరు 55లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కబ్జాదారుడు మాస్టర్ ప్లాన్ వేశాడు. 1970లో జింక్ కంపెనీ నిర్మాణం కోసం రైతుల నుంచి భూమి సేకరించారు. అయితే అదే సమయంలో స్థానికంగా ఉన్న ఓ సామాజిక వర్గం అవసరాల నిమిత్తం సుమారు 300 గజాల భూమిని కేటాయించారు. కాలక్రమేణ అది కబ్జాకు గురైంది. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 30ను విడుదల చేసి పట్టాల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానించింది. కబ్జాదారుడు పట్టా పొందడానికి పదిరోజుల క్రితం హడావిడిగా ఆ స్థలంలో రేకుల షెడ్డును నిర్మించి, దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై అధికారులు విచారణ జరపగా ఈ భూమి 56 సర్వే నంబరకు చెందిందని గుర్తించారు. రేకుల షెడ్డు పది రోజుల క్రితమే కట్టినట్టు గుర్తించారు. అయితే భూమి ని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి త ప్పుడు సర్వే నంబరు చూపిస్తూ దరఖాస్తు చేసుకున్నాడన్న విషయాన్ని అధికారులు గ్రహించారు.

ప్రమాదభరితంగా బావులు


నిరుపయోగంగా మారిన మంచినీటి బావి

గోపాలపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం వరకూ తాగునీటి అవస రాల కోసం వినియోగించిన మంచినీటి బావులు నిరుపయోగంగా మారాయి. జనావాసాల మధ్య ఉన్న బావుల చుట్టూ రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతు న్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాలు కార్పొరేషన్‌లో విలీనం కాకముందు ఈ ప్రాంత ప్రజలు వీటిపైనే ఆధారపడేవారు. కార్పొరేషన్‌లో విలీనం అయ్యాక కొళాయిలు ఏర్పాటు చేశారు. బావులకు మోటర్లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేసేవారు. జీవీఎంసీ అవతరించిన తరువాల వ్యక్తిగత కొళాయిలు వచ్చాయి. దీంతో బావులు నిరుపయోగంగా మారాయి. చాలా నిరుప యోగంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నిండిపోయి ప్రమాద భరితంగా మారాయి. అధికారులు వీటికి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 75వ వార్డులో రూ.75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా, అభివృద్ధి పనులు చేపట్టి వాటిని వేగంగా పూర్తిచేస్తోందన్నారు. గాజువాక నియోజకవర్గంలోని ప్రతి వార్డులోను గరిష్ఠంగా అభివృద్ధి పనులు చేసామని, ఇంకా చేయాల్సిన పనులు గుర్తించి వాటిని కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. నగర మేయరు పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలోనే నగర ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రధానంగా నగరంలో రహదారుల విస్తరణ, ఆధునీకరణ ప్రాధాన్యమిచ్చామన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే పంచకర్ల


వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజభరత్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వీఎమ్‌ఆర్‌డీఏ కమిషనర్ తేజభరత్‌ను ఆయన చాంబర్‌లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెందుర్తిలోని పలు పెండింగ్ సమస్యలను వీఎంఆర్‌డీఏ కమిషనర్ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించి రోడ్లను పూర్తి చేయాలని కోరారు. ఈ క్రమంలోనే వేపగుంట పినగాడి రహదారిని త్వరగా పూర్తి చేయాలని, అలాగే సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు, వేపగుంట జుత్తాడ రోడ్డుతో పాటు మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన ఎనిమిది రోడ్ల పనులకు వీఎంఆర్‌డీఏ సిద్ధపడాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణ పనులకు కృతనిశ్చయంతో ఉన్నామని కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

- ఉక్కు ఇంటక్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ


నిరసన తెలుపుతున్న ఉక్కు ఇంటక్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్,/పెదగంట్యాడ నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం జరగాలని పోరాటాలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదని, ఈ క్రమంలో చేపడుతున్న భారీ ఉద్యమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఉక్కు ఇంటక్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ప్లాంట్ బీసీ గేటు వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ నిర్వాసిత కార్మికులు తొలగించమని చెబుతూనే భారీగా తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరితే స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో భారీ ఉద్యమాలు చేస్తామని, ఈ ఉద్యమంలో ప్రజా సంఘాలు, నిర్వాసితులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. నిర్వాసితులకు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కాంట్రాక్టు కార్మిక పోస్టులు ఇస్తున్నారని ఆరోపించారు.

వాల్‌చంద్ హీరాచంద్‌కు ఘన నివాళి


వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న షిప్‌యార్డు సీఎండీ గిరి దీప్ సింగ్

మల్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్‌షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్ఎల్) వ్యవస్థాపకుడు ప్రముఖ పారిశ్రామివేత్త వాల్‌చంద్ హీరాచంద్ 143వ జయంతి వేడుకలు సోమవారం షిప్‌యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికు షిప్‌యార్డు సీఎండీ గిరి దీప్ సింగ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో తొలిషిప్‌యార్డును విశాఖలో నిర్మించిన మహానుబావుడు వాల్‌చంద్ హీరాచంద్ అని అన్నారు. అలాగే ఆయన ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీ, కార్ల కంపెనీలకు కూడా నిర్మించారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో షిప్‌యార్డు మరింత అభివృద్ధి చేసే దిశగా అందరూ పనిచేయాని కోరారు. ఈ కార్యక్రమంలో షిప్‌యార్డు అధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఫ్యూజన్ 2కే25'లో విజ్ఞాన్ విద్యార్థులకు బహుమతులు

అగనంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడ జేఎన్‌టీయూ స్కూల్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫార్మా ఫ్యూజన్ 2కే25'లో విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు వివిధ అంశాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు.

జడ్పీ హైస్కూల్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు


హైస్కూల్‌లో రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్న దృశ్యం

గోపాలపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మైదానంలో పదేళ్ల క్రితం ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. నీటి ఊటల కారణంగా ఏడాదిలో నాలుగైదు నెలలు మైదానం చిత్తడిగా ఉండేది. దీంతో విద్యార్థులు ఆడుకునేందుకు అనువుగా ఉండేది కాదు. నీటి ఊటల నుంచి నీరు రాకుండా మైదానం చుట్టూ కాలువ, ఎగువ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారు. దీంతోపాలు మైదానాన్ని అన్ని రకాల క్రీడలకు అనువుగా ఉండే విధంగా అభివృద్ధి చేస్తున్నారు. మరో రెండు నెలల్లో మైదానం క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుంది.

బాలల ప్రాంగణం.. పెద్దలకే అందలం!


ఆధునీకరించిన చిల్డ్రన్స్ థియేటర్

చిన్నారుల కార్యక్రమాలకు దూరంగా చిల్డ్రన్స్ ఎరీనా

ప్రకటనలకే పరిమితమైన సండే సందడి

- ఫంక్షన్లకే కేటాయిస్తున్న వైనం
- టీడీపీ హయాంలో ఆధునీకరణ
- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ
- పూర్వ వైభవం కోసం ఎదురుచూపులు

సిరిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): **నగరంలోని సిరిపురం కూడలిలో గల వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో చిన్నారుల కార్యక్రమాలకు అవకాశం లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా వినోదంతో కూడిన కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీనిలో ప్రస్తుతం ప్రైవేటు ఫంక్షన్లే పెద్దపీట వేస్తున్నారు.**



సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనా

నిర్వహణ భారాన్ని దృష్టిలో పెట్టుకొని రోజులో ఆరుగంటలు ఒక స్లాట్‌గా పెట్టి, పైఫ్లోర్ రూ.1.08 లక్షలు, కింద హాల్ రూ.71,300కు దీనిని అద్దెకు ఇస్తున్నారు. విశాలమైన ప్రాంగణం ఉండడంతో ప్రతినెలా సుమారు 20కి పైగా పెళ్లిళ్లు, రిసెప్షన్లు జరుగుతున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు లక్ష్యం నీరుగారిపోతోందని బాలల హక్కుల పరిరక్షణ సంస్థల నిర్వాహకులు విమర్శిస్తున్నారు. చిల్డ్రన్స్ ఎరీనాలో పిల్లల కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే ఆధునీకరణ

ఇక్కడి బాలల ప్రాంగణాన్ని 2016 డిసెంబరు 17న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ఆధునీకరించారు. ఇందుకోసం సుమారు రూ.16 కోట్లు వెచ్చించారు. 600 సీట్లతో 4కే టెక్నాలజీ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఇలాంటి ప్రాంగణం నిర్మించడం, దేశంలోనే అతిపెద్ద రెండో థియేటర్‌గా రికార్డుల్లోకి ఎక్కింది. కింద ఫ్లోర్‌లో ఎగ్జిబిషన్ హాల్, ఒకటో అంతస్థులు వివిధ కార్యాక్రమాల నిర్వహణకు అనుగుణంగా తీర్చిదిద్దారు.

గాలికొదిలేసిన వైసీపీ

చిల్డ్రన్స్ ఎరీనాను వైసీపీ పాలనలో గాలికొదిలేశారు. టీడీపీ అధికారం ఉండగా 2018లో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. తరువాత ఆ స్థాయిలో పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించలేదు. వైసీపీ పాలకులు పెత్తనం సాగించిన ఐదేళ్లలో దీనిని వ్యాపార కేంద్రంగా మార్చేశారనే విమర్శలున్నాయి.

పూర్వ వైభవం దక్కేనా..

బాలల ప్రాంగణానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శ్రద్ధ చూపుతున్నారు. ప్రతి ఆదివారం చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే వారు దీనిని సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించలేదు. విద్యాశాఖతో సమన్వయం చేసుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సంబంధించిన కార్యక్రమాలతోనైనా బాలల ప్రాంగణంలో సందడి నెలకొంటుంది. ప్రాంగణం పూర్వ వైభవం దిశగా కార్యక్రమాలకు పటిష్ఠ కార్యాచరణ అమలుచేయాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొందు సీతారాం కోరుతున్నారు.

జాతీయ సదస్సుకు జేమ్స్ స్టీఫెన్

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్‌కు జాతీయస్థాయిసదస్సుకుఆహ్వానం లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఈ నెల 26న ఢిల్లీలో సదస్సు జరుగుతుంది. సంవిధాన్ కార్యక్రమం ముగింపు సందర్భంగా సదస్సు నిర్వహిస్తున్నారు.

హాకీకి పూర్వ వైభవం దిశగా ప్రభుత్వం చర్యలు

- ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి, విష్ణు కుమార్‌రాజు, వంశీకృష్ణ
- హాకీ ట్రోఫీ ఆవిష్కరణ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, హాకీ ఆడుతున్న ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రో టర్ఫ్ మైదానాల అభివృద్ధితో హాకీకి పూర్వ వైభవం వస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ఈనెల 28 నుంచి తమిళనాడులో జరగనున్న జూనియర్ హాకీ వరల్డ్ కప్ టోర్నీని పురస్కరించుకుని హాకీ ఆంధ్ర, హాకీ విశాఖ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆంకోశ ఆడిటోరియంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ కొమ్మాదిలో ఆస్ట్రోటర్ఫ్ మైదానాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హాకీ ఏపీ అధ్యక్షుడు చాణక్యరాజు మాట్లాడుతూ ఒడిశాలో 24 ఆస్ట్రోటర్ఫ్ మైదానాలుండగా ఆంధ్రాలో మూడున్నాయన్నారు. కార్యక్రమంలో హాకీ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్కెతఈ.అప్పారావు, ఆంజనేయరావు, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు. అనంతరం వరల్డ్ కప్ ట్రోఫీని ఎంపీ శ్రీభరత్ ఆవిష్కరించి విశాఖలో హాకీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అర్జీలు పరిష్కరించే తీరు మారాలి: కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను పరిష్కరించే విధానంలో మార్పు రావాలని, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అధికారులతో కలిసి 358 వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి 118, జీవీఎంసీకి 129 పోలీసుశాఖకు 20, ఇతర విభాగాలకు 91 ఉన్నాయి. అనంతరం గత వారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అందిన వినతులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీక్‌కు సంబంధించి పరిహారం దక్కని 51 కుటుంబాలు, ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 107 మంది బాధితులపై విచారణ నివేదికలు సమర్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. వెంటనే నివేదికలు సమర్పించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కామన సుబ్బారావు, తుళ్ల చంద్రశేఖర్ లోగిస గణేశ్, కె.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు 115 ఫిర్యాదులు

విశాఖపట్నం: పోలీస్ కమిషనరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు అందాయి. సీపీ శంఖబ్రతబాగ్చి బాధితులతో మాట్లాడారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఆయా సమస్యలను తక్షణ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీకి అందిన ఫిర్యాదుల్లో కుటుంబకలహాలు, సివిల్ తగాదాలు, మోసానికి సంబంధించినవే ఉన్నాయి.

మహిళల అభ్యున్నతికే వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం

- ఎంపీ ఎం.శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా

కూర్మన్నపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి, భద్రత కోసమే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వర్కింగ్ ఉమెన్స్‌హాస్టళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయని ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఫైర్‌స్టేషన్ సమీపంలో రూ.30.38 కోట్లతో నిర్మించతలపెట్టిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణానికి సోమవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్(ఎస్ఏఎస్‌సీఐ)-2024-25' పథకం కింద స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. గాజువాకతోపాటు ముడసర్లోవ, మధురవాడలో వీటి నిర్మాణం జరుగుతుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన యువతులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. మేయర్ పీలా శ్రీనివాసరావు హాస్టల్ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఐటీ, ఇతర పరిశ్రమలు నగరానికి తరలిరానున్నందున ఉద్యోగం చేసే యువతులు, శిక్షణకు వచ్చే వారికి హాస్టల్స్ అండగా ఉంటాయని ఎంపీ శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ద్వారా వీటిని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్నాథం, గందం శ్రీనివాసరావు, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో జాతీయస్థాయి సదస్సులు

- పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో నగరంలోని నోవాటెల్‌లో మూడు ప్రధాన సదస్సులు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, పటిష్ఠ ఏర్పాట్లుచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, నోడల్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ బాల్య వివాహ ముక్తభారత్ (బీవీఎంబీ) ప్రత్యేక నేపథ్య ఔట్రీచ్ ప్రచారాన్ని ఈనెల 27న ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 100 రోజులు కొనసాగుతుదన్నారు. అదేరోజు మధ్యాహ్నం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(కారా), నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్‌ను నిర్వహిస్తోందని, దీనికి సారా, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు (డీసీపీయూ), అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రాస్పెక్టివ్ అడాప్టివ్ పేరెంట్ (పీఏపీ) ప్రతినిధులు హాజరవుతారన్నారు. 28న పార్లమెంట్ సంప్రదింపుల కమిటీ (సీపీపీ) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తుందని, కేంద్ర మంత్రులు, ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారన్నారు. ప్రొటోకాల్ మేరకు వాహనాలను ఏర్పాటు చేసి, లైజన్ అధికారులను నియమించాలన్నారు. విమానాశ్రయంలో సంప్రదాయ స్వాగత ఏర్పాట్లు, బందోబస్తు, భద్రత, ట్రాఫిక్ క్లియరెన్స్ చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వేదికలో ఎల్‌ఈడీస్క్రీన్, ఐటీ, డిజిటల్ సాంకేతిక సిబ్బంది నియామకం, ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను దత్తత తీసుకోవడం (దివ్యాంగ) లఘు చిత్ర ప్రారంభోత్సవం, ప్రదర్శన ఉంటుదన్నారు. వేదిక వద్ద అరకు కాఫీ స్టాల్, ప్రముఖులు, అధికారులు, ప్రత్యేక అవసరాలు పిల్లల కుటుంబాలకు ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఏర్పాట్లు చేయాలన్నారు.

గుర్రపుస్వారీ ప్రాజెక్టును అడ్డుకోండి

- మేయర్‌కు సీపీఎం కార్పొరేటర్ గంగారావు వినతి


మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగారావు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ పార్కులో గుర్రపుస్వారీ ప్రాజెక్టుని రద్దుచేయాలని గత ఏడాది డిసెంబరులో కౌన్సిల్ తీర్మానం చేస్తే... మళ్లీ తెరమీదకు తెచ్చి కాంట్రాక్టర్‌కు కట్టబెట్టే ప్రయత్నాలను ఆపాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మేయర్ పీలా శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముడసర్లోవ పార్కుని ఆనుకుని నాలుగు ఎకరాల భూమిని ప్రభు అసోసియేట్స్ సంస్థకు కౌన్సిల్ ఆమోదం లేకుండా కట్టబెట్టారన్నారు. దీనిపై కౌన్సిల్‌లో దుమారం లేవడంతో అప్పటి మేయర్ ప్రాజెక్టుని రద్దుచేయడంతోపాటు కాంట్రాక్టర్‌కు చెల్లించిన రూ.మూడు కోట్లు రికవరీచేయాలని, విచారణకు కార్పొరేటర్లతో కమిటీ నియమించాలని తీర్మానం చేశారన్నారు. తర్వాత మేయర్‌గా బాధ్యతలు చేపట్టినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టర్ వచ్చి కలిసేసరికి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆలోచిస్తున్నట్టు తెలిసిందన్నారు.

స్నేహితుల విషాదాంతం

- తీరానికి చేరిన శ్రీఆదిత్య మృతదేహం

మద్దిలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సరదాగా సముద్ర స్నానానికి దిగి గల్లంతైన స్నేహితుల కథ విషాదాంతమయింది. బుల్లయ్య కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న తేజెస్, శ్రీఆదిత్య స్నేహితులతో కలిసి వుడా పార్కు లైట్‌హౌస్ వెనుక బీచ్‌లో స్నానానికి దిగారు. కెరటాల తాకిడికి వీరిద్దరూ గల్లంతయ్యారు. ఆదివారం తేజెస్ మృతదేహం తీరానికి చేరగా, సోమవారం శ్రీఆదిత్య మృతదేహం ఒడ్డుకు వచ్చింది. రాకాసి అలలు కబళించిన ప్రదేశంలోనే ఇద్దరి మృతదేహాలు కొట్టుకువచ్చాయి. త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా శ్రీఆదిత్య రాజమహేంద్రవరం, తేజెస్ సాలూరుకు చెందినవారు.

యువకుడి ఆత్మహత్య


రాజేశ్ రెడ్డి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీకి చెందిన పట్టాన రాజేశ్‌రెడ్డి (29) ఓ కంపెనీ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. కొద్దిరోజులుగా పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆత్మహత్య చేసుకుంటానంటూ రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లగా స్నేహితులు మందలించి, తీసుకువచ్చారు. కాగా ఇదే విషయమై మరోసారి గొడవ జరగడంతో సోమవారం రాజేశ్ తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి వివాహిత మృతి


రాణి (ఫైల్ ఫొటో)

ఎండాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భవనం రెండో అంతస్థు పైనుంచి పడి ఓ వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన ఎండాడ రాజీవన్‌నగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎండాడ రాజీవ్‌నగర్‌లో కనితి వసంత్, భార్య కనితి రాణి (31) ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. వసంత్ రామానాయుడు స్టూడియోలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య రాణి గృహిణి. ఈ నెల 16న మిరాకిల్ చర్చిలో ప్రార్థనకు వెళ్లింది. ఆ ప్రాంతంలోనే ఉంటున్న కనకరాజుతో కలిసి ప్రార్థనలో పాల్గొందనే విషయం తెలిసిన కనకరాజు భార్య రాణిని ప్రశ్నించింది. ఈ విషయంపై మాట్లాడేందుకు రాణి ఆదివారం రాత్రి 9 గంటలకు కనకరాజు ఇంటికి వెళ్లింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో నిరీక్షిస్తోందని, అ దే సమయంలో తాను వెళ్లి రాణిని పిలవగా రెండో అంతస్థులో ఉన్న ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరగడంతో పైనుంచి పడిపోయి మృతిచెందిందని భర్త వసంత్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాణి మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రేగిన మంటలు


మంటల్లో కాలిపోయిన సామగ్రి

ఆరిలోవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో గల ఎస్‌వీపీ హోటల్ కమ్ ఫంక్షన్ హాల్లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ముందుగా రిసెప్షన్ వద్ద మంటలు రేగి దట్టమైన పొగతో వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఎలక్ట్రిక్ ప్యాన్ బోర్డు వరకు మంటలు వ్యాపించడంతో అగ్ని మాపక సిబ్బందికి సమచారం అందించారు అగ్ని మాపక శకటం చేరుకుని అదుపులోకి తెచ్చింది. ప్రమాదంలో 12 ఏసీలు, సెల్లార్‌లోని ద్విచక్ర వాహనం కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని హోటల్ ఎండీ పప్పల సత్యనారాయణ తెలిపారు.

పెందుర్తిలో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పెందుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఆదిత్యనగర్ సమీప గెడ్డ పోరంబోకు స్థలంలో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌కవేటర్‌తో కొంతమేర ఆక్రమణలు తొలిగించే ప్రయత్నం చేశారు. ఇక్కడి సర్వే నంబరు 181లో 10.25 ఎకరాల గెడ్డ పోరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, పెద్ద కాలమ్స్ తీసి అక్రమార్కులు వరుస నిర్మాణాలకు రంగం సిద్ధం చేశారు. దీనిపై 'ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఇంటి వెంకటఅప్పారావు ఆదేశాలతో వీఆర్వో అనంత్, సిబ్బంది ఆక్రమిత స్థలానికి చేరుకున్నారు. రెవెన్యూ రికార్డులు, ఎఫ్ఎంబీ స్కెచ్ ఆధారంగా ఆదిత్యనగర్‌లో ఎంత ప్రభుత్వ భూమి ఉందో నిర్ధారణ చేశారు. ఆక్రమణ జరిగిన గెడ్డ పోరంబోకు భూమికి సర్వే చేయనున్నారు. రెండు ప్రాంతాల్లో భారీ కాలమ్స్ తీసి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. అయితే ఆక్రమణల తొలగింపుపై అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉండడంతో సిబ్బంది వెనకడుగు వేసినట్టు సమాచారం. పూర్తి సర్వే నిర్వహించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

3న భగవద్గీత శ్లోక పఠన పోటీలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక పఠన పోటీలను ఈ నెల 30న నిర్వహించనున్నారు. ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టారులోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో జరిగే పోటీలకు 6,7,8,9 తరగతుల విభాగంలో 14వ అధ్యాయంలోని గుణత్రయ విభాగయోగం, పదో తరగతి, ఇంటర్మీడియట్ వారికి 16వ అధ్యాయంలో దైవాసుర సంపద్విభాగయోగంలోపోటీలుంటాయి. 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు 'నిత్య జీవితంలో భగవద్గీత-భావ విశ్లేషణపై పోటీలు నిర్వహిస్తారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ బహుమతి రూ.1116, ద్వితీయ బహుమతి రూ.816, తృతీయ బహుమతి రూ.516, ధ్రువపత్రం ప్రదానం చేస్తారు. వివరాలకు 8500641729 నంబరులో సంప్రదించవచ్చు.

ఆర్టీసీలో 24 మంది ఉద్యోగులకు పదోన్నతులు


పదోన్నతులు పొందిన ఉద్యోగులతో ఆర్ఎం, డీసీటీఎం, అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 24 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 16 మంది అసిస్టెంట్ డిపో క్లర్కులను డిపో క్లర్కులుగా, 8 మందికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-3లుగా పదోన్నతులు కల్పించారు. విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, మధురవాడ, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు డిపోల్లో వీరిని నియమించారు. ఈ మేరకు సోమవారం ఆర్ఎం కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీటీఎం కె.పద్మావతి, పీవో జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.